ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
ఆదివారం 30 జూన్ 2024

పరిశుభ్రమైన నీటితోనే అతిసార దూరం : జేసీ



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

రాయచోటి (కలెక్టరేట్) జూన్ 29: అతిసార వ్యాధి నిర్మూలనకు పరిశుభ్రమైన నీటి సరఫరా కీలకమని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ అన్నారు. శనివారం ఉదయం రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో అధికారులతో అతిసార వ్యాధి నిర్మూలనపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ అతిసార వ్యాధి ఇప్పటికే దేశంలో ముఖ్యమైన ప్రజా ఆరోగ్య సమస్యగా ఉందని, మన దేశంలో ఓ సర్వే ప్రకారం చిన్నపిల్లలు 5, 8 శాతం మంది చనిపోతున్నారని వారు తెలిపారు. ఈ నేపథ్యంలో అతిసార వ్యాధిని పూర్తిగా అరికట్టడానికి విద్య, వైద్య, గ్రామీణ నీటి సరఫరా, మున్సిపాలిటీ వారు ఎంతో కీలకపాత్ర వహించాల్సి ఉందన్నారు. అనంతరం గ్రామీణ ప్రాంతాల్లో నీటి సరఫరా గురించి ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కాంట్రాక్టర్ మాయాజాలం

- బ్లాక్‌లిస్టులో పెట్టినా..పెత్తనం వారిదే
- రూ.30 లక్షలు జీఎస్టీ ఎగ్గొట్టారు
- చేసిన పనులూ నాసిరకమే
- పెద్దిరెడ్డి ఇలాకాలో విద్యుత్తు శాఖ అస్తవ్యస్తం
- చక్కదిద్దే పనిలో అధికారులు నిమగ్నం



పెద్దిరెడ్డి ఇలాకాలోని తాలిబాన్ రాజ్యం.. తంబళ్లపల్లె నియోజకవర్గంలో విద్యుత్తు శాఖ కాంట్రాక్టర్ ఆగడాలు శృతిమించిపోయాయి. అధికారమే అండగా ఆ పార్టీ నేతలు అవకాశం ఉన్న అన్ని మార్గాలను తమకు అనుకూలంగా మార్చుకున్నారు. సబ్‌స్టేషన్ల నుంచి ట్రాన్స్‌ఫార్మర్లను దౌర్జన్యంగా ఎత్తుకెళ్లి అమ్మేయడమే కాదు.. చేయని పనులకూ బిల్లులు చేసుకున్నారు. ఇందులో భాగంగా అప్పటికే కోటిన్నరకు పైగా బిల్లుల రూపంలో పొందగా, అందుకు ప్రభుత్వానికి జీఎస్టీ రూపంలో చెల్లించాల్సిన రూ.30 లక్షలు ఎగ్గొట్టారు. చేసిన పనులూ నాసిరకంగా ఉన్నా అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడకపోవడం విశేషం.

మదనపల్లె, జూన్ 29: తంబళ్లపల్లెతో పాటు మదనపల్లెలోనూ విద్యుత్తు శాఖలో కాంట్రాక్టర్, ఆయన అనుచరులు వైసీపీ ఐదేళ్ల కాలంలో దౌర్జన్యకాండ కొనసాగించారు. అలాగే మదనపల్లె నీరుగట్టువారిపల్లె సబ్‌స్టేషన్ ఆవరణంలోని ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతుల కేంద్రం (ఎస్పీఎం) కూడా తమ అధీనంలోకి తీసుకున్నారు. రైతుల పొలాల వద్ద ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతే, ఇక్కడ రిపేరు చేసి, తిరిగి రైతులకు సరఫరా చేస్తుంటారు. అప్పటికే ఈ కేంద్రాన్ని నిర్వహిస్తున్న కాంట్రాక్టర్‌ను తరిమేసి అధికార పార్టీ అండతో తంబళ్లపల్లె నియోజకవర్గంలో పనులు తీసుకున్న కాంట్రాక్టరే ఈ కేంద్రాన్ని కూడా స్వాధీనం చేసుకున్నారు. ఇక్కడ కూడా ఆదేస్థాయిలో అక్రమాలు జరిగినట్లు చెబుతున్నారు. ఇందులో అటు ట్రాన్స్‌కోలో సిబ్బంది నుంచి ఉన్నతాధికారులను పావులుగా వాడుకోగా, ఇటు తోటి కాంట్రాక్టర్లను సమిధలు చేశారు. వైసీపీ అధికారంలోకి రాక ముందు వరకూ నియోజకవర్గంలోని ప్రతి మండలంలో ఇద్దరు విద్యుత్తు కాంట్రాక్టర్లు ఉండేవారు. ఈ క్రమంలో రైతులు, వినియోగదారులకు కావాల్సిన పనులను సకాలంలో చేసి పెట్టేవారు. వివిధ కారణాలతో ఒకరు పనులు చేయకపోయినా క్షేత్రస్థాయిలో ఆ శాఖాధికారులు మరో కాంట్రాక్టర్‌తో పని చేయించేవారు. తర్వాత పెద్దిరెడ్డి పెత్తనంలోని నియోజకవర్గం మొత్తానికీ ఒకే కాంట్రాక్టర్‌ను, అది కూడా ఆయన అనుయాయుడిని నియమించుకున్నారు. దీంతో అప్పటికే ఉన్న తంబళ్లపల్లె, కురబలకోట, బి.కొత్తకోట, ములకలచెరువు, పీటీఎం, పెద్దమ్యండ్యం మండలాల్లోని కాంట్రాక్టర్లు అందరినీ పనులు చేయకుండా దౌర్జన్యంగా పంపించేశారు. ఇంతకాలం వీరంతా పనులు లేక రోడ్డున పడ్డారు. అప్పటికే నియోజకవర్గంలో వీరు చేసిన పనులకు బిల్లులు చేయకుండా అధికారులపై రాజకీయ ఒత్తిడి తెచ్చి అడ్డుకున్నారు. వారి బిల్లులను కూడా తమ ఖాతాలో వేసుకున్నారు. తర్వాత ట్రాన్స్‌కో చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా సర్వీసులు మంజూరు కావడం, ట్రాన్స్‌ఫార్మర్లు, ఇతర సామగ్రి ఒకేసారి వచ్చి పడటంతో ఆ కాంట్రాక్టర్ పనులు చేయలేక చేతులెత్తేశాడు. దీంతో తంబళ్లపల్లెలోని ఆరు మండలాలతో పాటు మదనపల్లె మండలంలోని వెస్ట్ సెక్షన్‌లో పనులు స్తంభించిపోయాయి. ఈ క్రమంలో తమకు అవసరమైన పనులు వ్యయప్రయాసాలకోర్చి రైతులే చేసుకోవాల్సి వచ్చింది. రైతులు, విద్యుత్తు వినియోగదారులు తమ శక్తి మేర ట్రాన్స్‌కో సిబ్బంది చేతనో, ప్రైవేటు వ్యక్తుల చేతనో పనులు చేయించుకుంటే అధికార పార్టీ అండదండలతో ఆ బిల్లులు కూడా తమ ఖాతాలో వేసుకున్నారు. దీనిని వ్యతిరేకించిన సిబ్బంది నుంచి ఏఈ, డీఈలపై రాజకీయ ఒత్తిళ్లు తెచ్చారు. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి వారిని ఇబ్బందులకు గురి చేశారు.

రెండేళ్ల పాటు ప్రభుత్వం నుంచి పొందిన బిల్లులకు సంబంధించి జీఎస్టీ చెల్లించకపోవడంతో అధికారులు తర్వాత పెట్టిన బిల్లులు ఆపేశారు. కాంట్రాక్ట్ సంస్థను బ్లాక్‌లో పెట్టారు. అయినా క్షేత్రస్థాయిలో వీరి ఆగడాలు మాత్రం ఆగలేదు. అధికారులు వద్దన్నా.. బిల్లులు తిరస్కరించినా...యధావిధిగా తమకు కావాల్సిన పనులు చేపట్టారు. ఇందులో అధికారులను లెక్క చేయకుండా ట్రాన్స్‌ఫార్మర్లను ఒకచోట నుంచి మరోచోటికి దౌర్జన్యంగా తరలించడం, అయినవారికి అమ్మేయడం, అధికారుల అనుమతి లేకుండా ఎల్‌టీ, 11 కె.వి., 33 కె.వి.లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లను కూడా కూడా మార్చేశారు. ఇందులో రైతులకు సంబంధించిన వాటితో పాటు కమర్షియల్ పనులు కూడా ఎక్కువగానే ఉన్నాయి. రైతులు, విద్యుత్తు వినియోగదారులకు సంబంధించి చేసిన సేవలు తక్కువే అయినా..ఆదాయం సమకూర్చే పనులకే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చినట్లు ఆ శాఖాధికారులు వాపోతున్నారు. అధికారులు నోటీసులు పంపినా, కాంట్రాక్టర్‌పై ఒత్తిడి తెచ్చినా.. జీఎస్టీ చెల్లించలేదు. వారి కాంట్రాక్టు సంస్థను బ్లాక్‌లో పెట్టినా పనులు చేయడానికి ఎవరినీ రానీయలేదు. 2024 ఎన్నికల్లో వైసీపీనే మరోసారి అధికారంలోకి వస్తుందనే ధీమాతో ఉండిపోయారు. తంబళ్లపల్లె, కురబలకోట, బి.కొత్తకోట, ములకలచెరువు, పీటీఎం, పెద్దమండ్యం మండలాలతో పాటు మదనపల్లె నియోజకవర్గంలోని వెస్ట్ సెక్షన్‌లోనూ పాగా వేశారు. తమ పార్టీకే చెందిన మరో కాంట్రాక్టర్‌ను కూడా పనులు చేయకుండా అడ్డుకున్నారు. ఈ పంచాయితీ చివరకు ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి వరకూ వెళ్లినా ప్రయోజనం లేకపోయింది. దీంతో చివరకు ఆ కాంట్రాక్టర్ విద్యుత్తు పనులు వదిలేసి బయటకు వెళ్లిపోవడాన్ని చూస్తే, వీరి ఆగడాలు ఏ స్థాయిలో ఉన్నాయో చెప్పవచ్చు. ఎస్పీఎం కేంద్రానికి మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాల నుంచి రైతులు రిపేర్ల కోసం ట్రాన్స్‌ఫార్మర్లు తెస్తుంటారు. ఇందులోని వైరు కట్టడంలో, ఆయిల్ నింపడంలో అక్రమాలు చోటుచేసుకున్నాయి. మరోవైపు ట్రాన్స్‌ఫార్మర్‌లో ఎక్కడైనా వైరు కట్ అయితే, మొత్తం రిపేరు చేసినట్లు నమోదు చేసినట్లు చెబుతున్నారు.

కాంట్రాక్టర్ అక్కడక్కడా చేసిన పనులు కూడా నాసిరకమేనని ఆ శాఖ అధికారులు అంగీకరిస్తున్నారు. క్షేత్రస్థాయిలో విద్యుత్తు స్తంభం నాటడం నుంచి ట్రాన్స్‌ఫార్మర్ అమర్చడం వరకూ అన్నీ తూతూమంత్రంగానే ఉన్నాయి. జిల్లాలో ఎక్కడా లేని విధంగా తంబళ్లపల్లె నియోజకవర్గంలో ఈ స్థాయిలో పనులు జరిగితే క్వాలిటీ కంట్రోల్ అధికారుల జాడే లేకపోవడం కూడా ప్రస్తుతం చర్చనీయాంశమైంది. అయితే వీరిని క్షేత్రస్థాయిలో రాకుండా అధికారం అడ్డుకుందని చెబుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశాక లైన్ నుంచి కనెక్షన్ ఇచ్చే క్రమంలో హెడ్జ్ ఫీజు, ఎల్‌టీ ఫీజు సముదాయాన్ని ఏర్పాటు చేయాలి. కానీ కొన్నిచోట్ల ఆ రెండు వ్యవస్థలను ఏర్పాటు చేయకుండా, మరికొన్ని చోట్ల ఒక ప్రక్రియను చేపట్టి, మరో వ్యవస్థను వదిలేశారు. అలాగే ట్రాన్స్‌ఫార్మర్ నుంచి భూమిలోకి ఎర్త్ పైపు ఏర్పాటులో సీఏ పైపు స్థానంలో జీఏ పైపు వాడకంలోనూ కక్కుర్తికి పాల్పడ్డారు. ఈ రెండు వ్యవస్థలు అటు ట్రాన్స్‌ఫార్మర్, లైన్ల సేఫ్టీతో పాటు మనిషి విద్యుత్తు ప్రమాదం నుంచి బయటపడటానికి కీలకమైనవి. రైతుకు మంజూరైన సామగ్రిని స్వాహా చేసినట్లు చెబుతున్నారు. రైతుకు మంజూరైన ట్రాన్స్‌ఫార్మర్‌తో పాటు ఇతర పరికరాలు స్టోరుకు ఒకేసారి రాకపోయినా వచ్చిన తర్వాత వీటిని ఏర్పాటు చేయాల్సి ఉంది.

నియోజకవర్గంలోని కొందరు ఏఈలు కాంట్రాక్టర్‌తో ముందస్తు ఒప్పందం కుదుర్చుకున్నట్లు చెబుతున్నారు. కొందరు ఏఈ, అసిస్టెంట్ ఏఈలు కావాల్సిన చోట పోస్టింగు ఇప్పిస్తే.. రైతుల నుంచి తామే పనులు చేయించి మీరు బిల్లు పెట్టుకునేలా ఏర్పాటు చేస్తామని లోపాయికారీ ఒప్పందం కుదుర్చుకున్నట్లు తెలిసింది. సాధారణంగా విద్యుత్తు శాఖ పనుల్లో 70 శాతం వరకూ రైతే ఖర్చు పెట్టి చేయించుకుంటారు. మిగిలిన 30 శాతం పని మాత్రమే కాంట్రాక్టర్ చేయాల్సి ఉంటుంది. ఆ పని కూడా ఇక్కడ రైతుల నుంచే ఖర్చు పెట్టించి పూర్తి చేసినట్లు చెబుతున్నారు. కురబలకోట మండలంలో పనిచేసిన ఏఈ అనారోగ్యంతో సెలవులో వెళ్లగా అక్కడున్న సామగ్రిని మొత్తం సర్దేసినట్లు ఆ శాఖ కోడైకూస్తోంది. ఆసుపత్రి నుంచి విధులకు వచ్చిన ఏఈ చివరకు తన జీతం నుంచి ఆ లోటును నెలనెలా భర్తీ చేస్తున్నట్లు సమాచారం. అలాగే ఇతర మండలాల నుంచి తెచ్చిన సామగ్రిని కమర్షియల్ ఏరియాలలో కూడా వాడేశారు. ఇదిలావుండగా ఇబ్బడి ముబ్బడిగా రైతులకు సర్వీసులు, ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు చేశారు. క్షేత్రస్థాయిలో కాంట్రాక్టర్ ఆ స్థాయిలో పనులు చేయక స్తంభించిపోయాయి. తీరా ప్రభుత్వం మారాక చూస్తే, వర్క్ ఆర్డర్లు మిగిలిపోయాయి. ప్రస్తుతం వాటిని ఎలా పూర్తి చేయాలో సిబ్బంది, అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఇందులో కురబలకోట మండలంలోని అధికంగా 400కుపైగా వర్క్ ఆర్డర్‌లు మిగిలిపోగా, మిగిలిన అయిదు మండలాల్లో 250 వర్క్ ఆర్డర్‌లు పెండింగ్‌లో ఉన్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. నాలుగున్నరేళ్లలో విద్యుత్తు శాఖ పనులు అస్తవ్యస్తంగా మారిపోగా, ప్రస్తుతం వాటిని చక్కదిద్దే పనిలో ఉన్నతాధికారులు నిమగ్నమయ్యారు. ఈ క్రమంలో గతంలో పనిచేసిన కాంట్రాక్టర్లను రంగంలోకి దింపి సకాలంలో పనులు పూర్తి చేసేలా చర్యలు చేపడుతున్నారు.





ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్ కనెక్షన్‌లో సీఏ పైపు స్థానంలో ఏర్పాటు చేసిన జీఏ పైపు

స్కౌట్స్‌తో క్రమశిక్షణ, దేశభక్తి పెంపొందుతుంది

- అన్ని పాఠశాలల్లో స్కౌట్స్, గైడ్స్ యూనిట్ తప్పనిసరి
- మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



రాయచోటిటౌన్, జూన్ 29: స్కౌట్ శిక్షణతో విద్యార్థుల్లో క్రమశిక్షణ, దేశభక్తి పెంపొందుతాయని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. శనివారం రాయచోటి పట్టణంలోని మండిపల్లి భవన్‌లో మంత్రిని జిల్లా స్కౌట్స్ సెక్రటరీ మడితాటి నరసింహారెడ్డితో పాటు స్కౌట్స్ విద్యార్థులు కలిశారు. ఈ సందర్భంగా మంత్రి వారితో మాట్లాడుతూ అకడమిక్ క్యాలెండర్ ఆధారంగా స్కౌట్స్ విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలన్నారు. ఈ శిక్షణతో విద్యార్థుల్లో క్రమశిక్షణ, దేశభక్తి, సేవాభావం పెంపొందుతాయన్నారు. తల్లిదండ్రులు, గురువులతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ సమాజం పట్ల బాధ్యతగా వ్యవహరించడానికి స్కౌట్స్ శిక్షణ తోడ్పడుతుందన్నారు. స్కౌట్‌తో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు, ఉన్నత విలువలు సమకూరుతాయన్నారు. దీంతో పాటు విద్యార్థుల్లో మానసిక, శారీరక, దృఢత్వం ఏర్పడుతుందన్నారు. స్కౌట్ సర్టిఫికెట్ కలవారికి విద్య, ఉద్యోగ అవకాశాల్లో రిజర్వేషన్ సౌకర్యం ఉందని దానిని ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ స్టేట్ ఆర్గనైజింగ్ కమిషనర్ లక్ష్మీకర్, గైడ్ కెప్టెన్ హేమలత, స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌లో 102 కేసులు పరిష్కారం



కేసులను విచారిస్తున్న జడ్జి కృష్ణన్‌కుట్టి

రాయచోటిటౌన్, జూన్ 29: సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు జాతీయ లోక్‌అదాలత్ కార్యక్రమంలో భాగంగా శనివారం రాయచోటి పట్టణంలోని జిల్లా 5వ అదనపు కోర్టులో రాజీమార్గం ద్వారా 102 కేసులను పరిష్కరించారు. ఈ సందర్భంగా రాయచోటి కోర్టు పరిధిలోని వివిధ మండలాల నుంచి వచ్చిన 102 క్రిమినల్, ఎస్‌వీఓపీ యాక్ట్, యాక్సిడెంట్, చెక్‌బౌన్స్, ఎన్‌ఐ యాక్ట్, ఇన్సూరెన్స్‌కు సంబంధించిన ఎంవీవోపీ తదితర కేసులను జిల్లా ఐదవ అదనపు జడ్జి ఎస్.కృష్ణన్‌కుట్టి, సీనియర్ సివిల్ జడ్జి డాక్టర్ ప్రసన్న, ప్రిన్సిపల్ జూనియన్ సివిల్ జడ్జి ఆసిఫ్‌సుల్తాన్, మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి డాక్టర్ కె.శారదలు కేసులను పూర్తి స్థాయిలో విచారించి కక్షిదారులతో మాట్లాడి రాజీమార్గం ద్వారా 102 కేసులను పరిష్కరించారు. ఈ కేసులను రాజీమార్గం ద్వారా పరిష్కరించి బాధితులకు రూ.కోటి 53 వేల 954లు పరిహారంగా అందజేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు, ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధులు, బ్యాంక్ అధికారులు, పోలీసులు, సభ్యులు రమణ, వీరభద్రయ్య, ఆదిరెడ్డినాయక్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

తప్పు చేయకుంటే గన్‌మెన్‌లు ఎందుకు?

- చేసిన పాపాలు అనుభవించక తప్పదు
- పెద్దిరెడ్డి కుటుంబంపై ఎమ్మెల్యే నల్లారి ధ్వజం





పీలేరులో టీడీపీ శ్రేణుల ర్యాలీ.. కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి

పీలేరు, జూన్ 29: 'అధికారంలో ఉన్నప్పుడు నియంతల కంటే దారుణంగా ప్రవర్తించారు. అధికారం పోయాక చేసిన పాపాలు వెంటాడుతాయేమోనని భయపడుతున్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజలతో కలిసి ఉంటేనే మంచిదన్న కనీస సత్యాన్ని గుర్తించలేకపోయారు. ఇప్పుడేమో తమకు గన్‌మెన్‌లతో భద్రత కావాలని కోర్టు మెట్లెక్కారు. చేసిన పాపాలకు వారు మూల్యం చెల్లించక తప్పదు' అంటూ మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిపై పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి ధ్వజమెత్తారు. పీలేరులోని ఏఎంసీ ప్రాంగణంలో శనివారం పీలేరు మండల టీడీపీ, బీజేపీ, జనసేన కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారం శాశ్వతం అన్నట్లు పుంగనూరు నియోజకవర్గంలోని ప్రతిపక్ష పార్టీల నేతలను, ప్రజాస్వామ్యవాదులను మాజీ మంత్రి కుటుంబసభ్యులు ఇబ్బందులు పెట్టారన్నారు. ప్రజలు తిరగబడితే స్వంత నియోజకవర్గంలోకి అడుగుపెట్టే పరిస్థితి లేకుండా చేసుకున్నారన్నారు. చేసిన తప్పులకు ఇంకెంత మంది తిరుగుబాటు చేస్తారేమోనని భయపడి తమకు భద్రత కావాలని హైకోర్టును ఆశ్రయించారన్నారు. అమాయక ప్రజలు, అన్నెం పుణ్యం ఎరుగని విద్యార్థులు, అంగళ్లు, పుంగనూరు ఘటనల్లో ఎటువంటి సంబంధం లేని వందలాది మందిపై అక్రమ కేసులు బనాయించారని గుర్తు చేశారు. ఆ పాపాలన్నింటికీ పెద్దిరెడ్డి కుటుంబం మూల్యం చెల్లించక తప్పదని తెలిపారు.

అవినీతి, అక్రమాలకు దూరంగా ఉండండి

అధికారంలో ఉన్నామన్న అహంభావం, ఏం చేసినా చెల్లుబాటు అవుతుందన్న భ్రమలో ఉండరాదని, అవినీతి, అక్రమాలకు దూరంగా ఉండాలని కూటమి శ్రేణులను నల్లారి కిశోర్ కుమార్‌రెడ్డి హెచ్చరించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తనూ ఆదుకుంటామని, ప్రభుత్వం అందించే సంక్షేమ, అభివృద్ధి పథకాల్లో వారిని భాగస్వామ్యులను చేస్తామన్నారు. జగనన్న కాలనీల పేరిట వైసీపీ నేతలు పేదల నుంచి డబ్బు వసూలు చేశారని, అటువంటి పనులను తాను ప్రోత్సహించబోనని స్పష్టం చేశారు. అధికారం ఉంది కాదా అని ప్రభుత్వ వ్యవహారాలలో మితిమీరి జోక్యం చేసుకోవద్దని, క్రమశిక్షణకు మారుపేరైన టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి చెడ్డపేరు తేవద్దని విజ్ఞప్తి చేశారు.

కిశోర్‌కు భారీ స్వాగతం

ఎమ్మెల్యే హోదాలో తొలిసారిగా పీలేరుకు విచ్చేసిన నల్లారి కిశోర్ కుమార్ రెడ్డిని శనివారం పీలేరు మండల కూటమి శ్రేణులు భారీ ఎత్తున స్వాగతం పలికారు. స్థానిక సంజయ్ గాంధీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి కార్యకర్తల సమావేశం జరిగిన ఏఎంసీ ప్రాంగణం వరకు భారీ బైకు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ పొడవునా భారీ ఎత్తున బాణాసంచా పేలుళ్లు, బళ్లారి డ్రమ్స్‌తో ఆయనకు స్వాగతం పలికారు. వేర్వేరుగా జరిగిన ఈ కార్యక్రమాల్లో పెద్దఎత్తున కూటమి నేతలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా పట్టణాభివృద్ధికి కృషి చేద్దాం

కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె, జూన్ 29: పార్టీలు, కులాలు, మతాలకతీతంగా మనమంతా కలసికట్టుగా పట్టణాభివృద్ధికి కృషి చేద్దామని ఎమ్మెల్యే, మున్సిపల్ ఎక్స్‌అఫిషియో సభ్యుడు ఎం.షాజహాన్‌బాషా పాలకవర్గానికి పిలుపునిచ్చారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ వి.మనూజ అధ్యక్షతన శనివారం మున్సిపల్ సాధారణ సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యేగా రెండోసారి ఎన్నికైన షాజహాన్‌బాషా ఎక్స్‌అఫిషియో సభ్యుడిగా ప్రమాణస్వీకారం తర్వాత ఆ హోదాలో కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలతో సంబంధం లేకుండా తాను, పాలకవర్గం కలసికట్టుగా పనిచేస్తూ, పట్టణ అభివృద్ధికి కృషి చేద్దామని ప్రకటించారు. రెండేళ్ల మున్సిపల్ పాలన ఎలా జరిగిందో పక్కన పెట్టి, ఇప్పటి నుంచి సంయుక్తంగా పనిచేద్దామని సూచించారు. మనం తీసుకునే నిర్ణయాలు పట్టణ అభివృద్ధి, ప్రజాసంక్షేమంతో ముడిపడి ఉండాలని అందుకు ప్రతి ఒక్కరూ కలసి రావాలని కోరారు. ఈ క్రమంలో పట్టణాన్ని సర్వాంగసుందరంగా తీర్చిదిద్దాలని సూచించారు. ఇందులో భాగంగా మొదటగా పట్టణంలో 50 వేల మొక్కలు నాటడానికి శ్రీకారం చుడతామని, అందుకు వార్డుల్లో కౌన్సిలర్లు అంతా సహకరించాలన్నారు. మదనపల్లెను జిల్లాగా చేసుకునేందుకు మనమంతా కలసికట్టుగా పనిచేస్తామని ఆయన పిలుపునిచ్చారు. అభివృద్ధిలో పట్టణం అన్ని విధాలా వెనుకబడి ఉందని, ముఖ్యంగా తాగునీటి సరఫరా, పారిశుధ్యం నిర్వహణపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. తాగునీటి సరఫరాలో ప్రత్యామ్నాయమైన ట్యాంకర్లు ముఖ్యం కాదని, పర్మనెంట్ సోర్సు ప్రధానమైందని, ఆ దిశగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ వి.మనూజ మాట్లాడారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు పి.తులసి, వైస్‌చైర్మన్లు జింకా వెంకటాచలపతి, బి.ఎ.నూర్‌ఆజాం, కె.ప్రసాద్‌బాబు, మార్వారి నాగార్జునబాబు, పి.రాజేష్, పాల్ చంద్రశేఖర్, మందపల్లె వెంకటరమణ, ఎస్.కరీముల్లా, ఆర్.శివ, వై.గిరిజ, తదితరులు సమస్యలను పరిష్కరించాలని కోరారు.

మనీరత్నమా వేటు తప్పదు

- టౌన్‌ప్లానింగ్ ఏసీపీ అవినీతిపై వాడీవేడి చర్చ
- కౌన్సిలర్లు చెబితే అధికారులు స్పందించాలి
- అధికారులు, సిబ్బంది మందగించారు
- తీరుమార్చుకోకుంటే వేటు తప్పదు
- ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి



మున్సిపల్ సమావేశంలో ఏసీపీ మునిరత్నంను ప్రశ్నిస్తున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి



సమావేశంలో అధికారుల తీరును వివరిస్తున్న కౌన్సిలర్ మురళీధర్‌రెడ్డి

ప్రొద్దుటూరు, జూన్ 29: మున్సిపల్ కార్యాలయంలో టౌన్‌ప్లానింగ్ ఏసీపీ మునిరత్నం మనీరత్న మయ్యాడని, ఆయన అవినీతిపై కౌన్సిల్ సమావేశంలో వాడీ వేడి చర్చకు దారితీసింది. డబ్బే పరమావధిగా పనిచేస్తున్నాడని కౌన్సిలర్లు ధ్వజమెత్తారు. ఫలితంగా పట్టణంలో విచ్చలవిడిగా ఎక్కడ చూసినా అక్రమ కట్టడాలు వెలుస్తున్నాయని వారు ఆరోపించారు. దీంతో నీ అవినీతి లెక్కలు తేలే వరకూ ఎక్కడికీ పోలేవని ఎక్స్ అఫీషియో సభ్యుడిగా కౌన్సిల్ సమావేశానికి మొదటిసారి హాజరైన ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి మునిరత్నంను తీవ్రంగా హెచ్చరించారు. సమావేశం వివరాల్లోకెళితే...

శనివారం ఉదయం చైర్‌పర్సన్ భీమునిపల్లె లక్ష్మీదేవి అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది. సమావేశంలో కౌన్సిలర్లు వంగనూరు మురళీధర్‌రెడ్డి, ఇర్ఫాన్‌బాషా, మహ్మద్‌గౌస్, జంబాపురం వెంకటలక్ష్మీ, చింతకుంట సరిత మాట్లాడుతూ టౌన్ ప్లానింగ్ ఏసీపీ మునిరత్నం కౌన్సిలర్లకు సరైన విలువ ఇవ్వడంలేదని విమర్శించారు. ఎవరి ఫోన్ ఎత్తడు, వార్డులో జరిగే అక్రమ కట్టడాలపై ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకోకపోగా వారికే ఎలా కట్టుకోవచ్చో సలహాలు ఇచ్చితన జేబులు నింపుకొంటున్నాడని ఆరోపించారు. ప్రతి వార్డుకు ప్లానింగ్ సెక్రటరీలున్న పట్టణంలో వందలాది అక్రమ కట్టడాలు, ప్లాను లేకుండా, విరుద్ధంగా కట్టినా పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి స్పందిస్తూ 'మునిరత్నం ఇప్పటికే నీవు నెల్లూరులో అవినీతికి పాల్పడుతూ ఏసీబీకి పట్టుబడి కేసులు ఎదుర్కొంటున్నావు. ఇంకా నీ తీరులో మార్పు రాలేదు. నిన్ను ఎక్కడికీ బదిలీ చేయకుండా నీవు చేసిన అక్రమాలన్నింటిపై చర్యలు తీసుకోనిదే నిన్ను పంపనని' ఆగ్రహిస్తూ తీవ్రంగా హెచ్చరించారు. కౌన్సిలర్లు ఇచ్చే ఏ ఫిర్యాదుకైనా అధికారులు, సిబ్బంది స్పందిచాలన్నారు. ప్రభుత్వం నుంచి జీతం తీసుకునే ప్రతి ఉద్యోగీ జవాబుదారీతనంగా పనిచేయాలన్నారు. చాలా మంది అధికారులు సిబ్బంది మందగించి నిర్లక్ష్యంగా వున్నారని తీరు మార్చుకోకపోతే వేటు తప్పదన్నారు. మున్సిపాలిటీలో చేసిన పనులు నాసిరకంగా వున్నాయని, వాటన్నింటినీ స్వయంగా పరిశీలిస్తానన్నారు. మోడంపల్లెలో నిర్మించే అర్బన్ హెల్త్‌సెంటరుకు ఇసుక లేదని, నిధులు రాలేదని అందువల్ల కాంట్రాక్టర్ పనులు చేయలేకపోయాడని ఆ పని రద్దు చేసి మళ్ళీరేట్లు పెంచి పనులు పెట్టడంలో మతలబువుందని ఎమ్మెల్యే అభిప్రాయపడ్డారు. ప్రొద్దుటూరులో ఇసుక దొరకని పరిస్థితే లేదన్నారు. ఇదంతా రేట్లు పెంచుకుని అడ్డంగా సంపాదించుకోవడానికే ఎత్తన్నారు. ప్రజా సమస్యలు ఏమున్నా సత్వరం పరిష్కరించేలా అధికారులు కమిషనర్ చొరవతో పనిచేయాలన్నారు. సమావేశంలో 7 అంశాల అజెండాపై చర్చించారు. ఇందులో ప్రధానంగా గార్బేజ్ ట్రాన్స్‌మిషన్ స్టేషన్స్‌కు స్థలాలు లేకపోవడం వలన రద్దు చేయడంపై ఎమ్మెల్యే అభ్యంతరం పెట్టారు. స్థలాలు చూసి ప్రజల కోసం ఏర్పాటు చేయడంపై అవగాహన పెంచి వాటిని నిర్మించేలా చర్యలు తీసుకోవాలన్నారు. మున్సిపల్ కౌన్సిల్ సమావేశ భవనంలో మాజీ ఇన్‌చార్జ్ చైర్మెన్ ముక్తియార్, మాజీ కౌన్సిలర్లు, టీడీపీ నేతలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. సమావేశం ప్రారంభంలో ఎక్స్ అఫీషియో సభ్యుడిగా ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి మొదటిసారి కౌన్సిల్ సమావేశానికి హాజరవడంతో ఆయనకు మున్సిపల్ కమిషనర్ రఘునాధరెడ్డి, కౌన్సిలర్లు పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. సమావేశానికి వన్‌టౌన్, ట్రాఫిక్ సీఐలు శ్రీకాంత్, యుగంధర్ ఎస్‌ఐ హైమావతి సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

రోడ్డు దాటుతూ వ్యక్తి మృతి



వెంకటరమణ మృతదేహం

చెన్నూరు, జూన్ 29: మండలంలోని హైవేపై పాత టోల్‌గేటు వద్ద శుక్రవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీడ్రైవరు కంచెం వెంకటరమణ (54) మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు ఎర్రగుంట్ల వాసి వెంకటరమణ తిరుపతి నుంచి దాల్మియా కర్మాగారానికి సిమెంటు మెటీరియల్ తీసుకెళ్లేవాడు. ఈ నేపథ్యంలో తిరుపతి నుంచి బయల్దేరి శుక్రవారం అర్ధరాత్రి దాటిన తరువాత నిద్ర రావడంతో పాత టోల్‌గేటు వద్ద లారీని నిలిపి హోటల్‌కు వెళ్లి టీ తాగి తిరిగి లారీ ఎక్కేందుకు రోడ్డు దాటుతుండగా కడప వైపు వెళ్లే ఏపీ 39 ఎన్ఎన్ 3712 నెంబరు కారు వేగంగా వచ్చి ఢీకొంది. దీంతో తీవ్ర గాయాలపాలైన వ్యక్తిని ఆస్పత్రికి తరలించేలోగా మృతి చెందాడు. కాగా ఇటీవల ఓ మహిళ ఆమె మరిది కుమారుడు ఇదే చోట రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. దీనికి ప్రధాన కారణం చీకటి పడిన తరువాత అక్కడ లైట్లు లేకపోవడం, విద్యుద్దీపాలు లేకపోవడం ప్రధానకారణమని స్థానికులు విమర్శలు గుప్పిస్తున్నారు.

చస్తున్నా మారరా... !

పాత టోల్‌గేటు ప్రాంతంలో లైట్లు లేవనే విషయం పలుమార్లు పత్రికల్లో రావడం, హైవే అధికారులకు కార్పొరేషన్ వారికి చెప్పినా ప్రయోజనం లేకుండాపోయింది. ఇంకా ఎన్ని ప్రాణాలు బలి కావాలని మండల ప్రజలు, వాహనాల్లో రాకపోకలు సాగించేవారంతా మండిపడుతున్నారు. ఇటీవలే ఓ మహిళ, ఆమె మరిది కుమారుడు బస్సు ఢీకొనడంతో అదే ప్రాంతంలో మృతి చెందగా ఇప్పుడు మరో నిండు ప్రాణం బలైంది. పేద లారీ డ్రైవరు మృతిచెందితే ఆ కుటుంబానికి దిక్కెవరని పలువురు ప్రశ్నిస్తున్నారు.

రాజకీయాలు పక్కన పెట్టండి : ఎమ్మెల్యే

- అభివృద్ధి కోసం పరస్పర సహకారం అవసరం
- ఎవరు తప్పు చేసినా జగన్ గతే పడుతుంది



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి

ఎర్రగుంట్ల, జూన్ 29: రాజకీయాలు పక్కన పెట్టి అభివృద్ధికి సహకరించాలని కౌన్సిల్ సమావేశంలో జమ్మలమడుగు ఎమ్మెల్యే సి.ఆదినారాయణరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం ఎర్రగుంట్ల నగరపంచాయతీ సమావేశంలో చైర్మన్ హర్షవర్ధన్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ జమ్మలమడుగు నియోజకవర్గం బాగా అభివృద్ధి చేసేందుకు అందరిసహకారంతో ముందుకెళదామన్నారు. రాజకీయలుంటే బయట చూసుకోవాలని, అభివృద్ధి గురించే ఇక్కడ మాట్లాడదామని ఆయన పాలక మండలికి సూచనలిచ్చారు. ఎర్రగుంట్లలో తాగునీటి సమస్య, డ్రైనేజీ సమస్య, ఇతర సమస్యలపై శాఖల వారీ సమీక్షించారు. తాగునీటి సరఫరాపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. గండికోట నుంచి వచ్చే స్కీం గురించి చర్చించారు. ముందుగా నగర పంచాయతీలో పైప్‌లైన్ ప్రక్రియ మొదలుపెట్టాలన్నారు. సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్‌తో అక్కడే మాటాడారు. గండికోట స్కీం వచ్చిన తర్వాత ప్రస్తుత పైప్‌లైన్లకు కనెక్షన్ ఇచ్చే వసతిపై ఆయన చర్చించారు. డ్రైనేజీ వ్యవస్థ బాగుచేసేందుకు తీసుకో వాల్సిన చర్యలపై ఆయన చర్చించారు. ప్రధాన డ్రైన్స్‌లోని పూడిక తీసేందుకు వెంటనే ప్రతిపాదనలు పంపాలన్నారు. పూర్తి స్థాయిలో డ్రైనేజీ వ్యవస్థను వేసేందుకు గల సాధ్యాసాధ్యాలపై, అంచనాలను తయారు చేయాలన్నారు.

గత ప్రభుత్వం తీసుకొచ్చిన ల్యాండ్ టైట్లింగ్ యాక్టును రద్దు చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఈయాక్టు వల్ల రైతులకు భారీ నష్టం జరిగేదన్నారు. సొంత భూములను కూడా రైతులు అమ్ముకోలేని పరిస్థితి వచ్చేదన్నారు. మేము తప్పు చేసినా జగన్ గతే పడుతుందని, మేము సేవకులగా పనిచేస్తామన్నారు. మొత్తం రూ.1.70లక్షల అభివృద్ధి పనులు చేసేందుకు ఆమోదం తెలిపినట్లు తెలిపారు. ఎర్రగుంట్ల చుట్టూ నేషనల్ హైవేలొస్తున్నాయని, దీనికి తోడు ఎక్స్‌ప్రెస్ హైవే కూడా పనులు జరుగుతున్నాయని ఇవి పూర్తయితే స్టీల్ ప్లాంట్, ఏసీసీ సిమెంట్, తేజ సిమెంట్స్ కూడా తెచ్చేందుకు కృషిచేస్తామన్నారు. జగనన్న కాలనీ అభివృద్ధికి కృషిచేస్తామన్నారు.

గండి ఏసీగా వెంకటసుబ్బయ్య



చక్రాయపేట, జూన్ 29: రాయలసీమలో ప్రసిద్ధిగాంచిన గండి క్షేత్రం సహాయ కమిషనర్‌గా వెంకటసుబ్బయ్యను నియమించారు. శనివారం ఆయన బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ముకుందరెడ్డి రిలీవ్ అయి వెళ్లిపోయారు. తొలుత ఆంజనేయస్వామిని దర్శించు కున్న ఆయన గండి దేవస్థాన సిబ్బందితో సమావేశమయ్యా రు. ఆలయం అభివృద్ధిపై, డ్యూటీలపై, శ్రావణమాసోత్సవాల తీరుపై ఆరాతీశారు. ప్రధాన అర్చకులు కేసరి పూజలు చేయిం చి సత్కరించారు. అనంతరం వసతిగృహాలు, గోశాల, క్యూలై న్లు, రాజగోపురం, ప్రహరీ పరిశీలించారు. కార్యక్రమంలో మాజీ చైర్మన్ వెంకటస్వామి, భాస్కర్ పాల్గొన్నారు.

అనాథ బాలుడి మృతదేహానికి అంత్యక్రియలు



అంత్యక్రియలు నిర్వహిస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు టౌన్, జూన్ 29: జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన బాబురెడ్డి (4) మృతిచెందడంతో అంత్యక్రియలను మేబిహెల్ప్‌యూ ఫౌండేషన్ చేపట్టింది. బాలుడికి తల్లిదండ్రులు, బంధువులు ఎవరూ లేకపోవడంతో ఆస్పత్రి సిబ్బంది ఫౌండేషన్‌ను సంప్రదిస్తే ఫౌండేషన్ చైర్మన్ మోరే లక్ష్మణరావు శనివారం సాయంత్రం హిందూ శ్మశాన వాటికలో బాలుడి మృతదేహానికి అంతిమ సంస్కారాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు సుబహాన్, చారూన్, వెంకటలక్షుమ్మ, సుమన్, బాబు, సురేష్, శ్రీరాం తదితరులు పాల్గొన్నారు.

రూ.125000 జరిమానా వసూలు

కాశినాయన,జూన్ 29: అక్రమంగా ఇసుక, గ్రావెల్ తరలిస్తున్న వాహనాలను పట్టుకుని వారికి రూ.125000లు జరిమానా విధించినట్లు తహసీల్దారు క్రిష్ణ తెలిపారు. ఆమేరకు పట్టుబడిన ఎక్స్‌కవేటర్ సహా రెండు ట్రాక్టర్ల ఓనర్ల నుంచి జరిమానా వసూలుచేసి ఆమొత్తాన్ని శనివారం ప్రభుత్వ ఖజానాకు జమచేశామన్నారు. ఆయన మాట్లాడుతూ అక్రమంగా ఇసుక, గ్రావెల్ తరలిస్తూ వాహనాలు పట్టుబడితే ఒక్కోవాహనానికి రూ.70 వేలు వరకూ జరిమానా విధిస్తామన్నారు.

ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈగా ఈశన్ బాషా

కడప(రూరల్) జూన్ 29: అనంతపురం జిల్లా ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ ఈశన్ బాషాకు కడప జిల్లా ఆర్‌డబ్ల్యుఎస్ ఇన్‌చార్జ్ ఎస్ఈగా అదనపు బాధ్యతలను రాష్ట్రప్రభుత్వం అప్పగించింది. ఈ మేరకు ఆయన సోమవారం బాధ్యతలను తీసుకోనున్నారు. ఇదివరకు ఇక్కడ ఇన్‌చార్జ్ ఎస్ఈగా పనిచేస్తున్న వీరన్న ఉద్యోగ విరమణ చెందడంతో ఈ మార్పు చోటుచేసుకుంది.

ఎయిర్‌గన్‌తో దాడి : సీఐ

చిన్నమండెం జూన్ 29: దిగువగొట్టివీడులో పుల్లగూర శ్రీరాములు పొలం దున్నుతుండగా ఈ స్థలం మాదంటూ గురుజాల పాపారావు ఎయిర్‌గన్‌తో శుక్రవారం దాడి చేశారు. ఎస్ఐ రమేష్‌బాబు, రాయచోటి సీఐ తులసిరామ్ తెలిపిన వివరాల ప్రకారం శ్రీరాములు తలపై పాపారావు ఎయిర్‌గన్‌తో బలంగా కొట్టడంతో తలకు రక్త గాయాలయ్యాయన్నారు. గ్రామస్తులు వారించి ఎయిర్‌గన్ లాక్కోవడంతో నిందితుడు పరారీ అయ్యాడు స్థానికులు ఎయిర్ గన్‌ను పోలీస్‌స్టేషన్‌లో అప్పజెప్పారు. నిండితునికి నోటీసులు జారీ చేశామని, ఈ కేసు ఆయుధాల నిరోధక చట్టం కిందకి వస్తుందా లేదా యని న్యాయసలహా కోరుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

'నవోదయ' ఫలితాల్లో 'విశ్వం' ప్రభంజనం



సాత్వీక   మహిత   యుగంధర్   యశ్వంత్   లక్ష్మీనారాయణ

తిరుపతి(విద్య), జూన్ 29: జాతీయస్థాయిలో జవహర్ నవోదయ విద్యాలయాల్లో 2024-25 విద్యాసంవత్సరానికి 11వ తరగతిలో ప్రవేశాలకోసం నిర్వహించిన పరీక్ష ఫలితాల్లో తిరుపతి విశ్వం విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని ఆ స్కూల్ చైర్మన్, కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి తెలిపారు. తమ విద్యార్థులు ఎం.యశ్వంత్, ఆర్.మహిత, ఎ.యుగంధర్, పి.సాత్విక, వి.లక్ష్మీనారాయణ సీట్లు సాధించారన్నారు. ఈ విద్యా సంవత్సరంలో 6, 9 తరగతుల ప్రవేశ పరీక్ష ఫలితాల్లోనూ గంగాజైదీప్‌రెడ్డి, లాస్య, లిఖిత, ఉదయశ్రీ, లక్ష్మి, కేతన్‌భాస్కర్, జ్యోత్స్న, గౌతమ్‌కుమార్, హేమంత్, కేథన్, హాసిని సహా మొత్తం 48మంది విద్యార్థులు సీట్లు సాధించి సత్తా చాటారని వివరించారు. ప్రతిభ చూపిన విద్యార్థులను కరస్పాండెంట్ ఎన్.తులసీవిశ్వనాథ్, అకడమిక్ డైరెక్టర్ ఎన్.విశ్వచందన్‌రెడ్డి, విశ్వశ్రీ అభినందించారు.

వీరన్న సేవలు అభినందనీయం

- కలెక్టర్ విజయరామరాజు

కడప(రూరల్) జూన్ 29: గ్రామీణ నీటి సరఫరా, పారిశుధ్య శాఖ (ఆర్‌డబ్ల్యూఎస్) ఇన్‌చార్జ్ ఎస్ఈగా వీరన్న అందించిన సేవలు అభినందనీయమని కలెక్టర్ విజయరామరాజు పేర్కొన్నారు. వీరన్న ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈగా పనిచేస్తూ శనివారం ఉద్యోగ విరమణ చెందారు. ఈ సందర్భంగా జడ్పీ ఆవరణలోని డీపీఆర్‌సీ భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ అర్‌డబ్ల్యుఎస్ శాఖలో వీరన్న వివిధ హోదాల్లో పనిచేసి మంచి గుర్తింపు, గౌరవాన్ని పొందారన్నారు. ఉత్తమ వ్యక్తిగా పనిచేసి ఏ రిమార్క్ లేకుండా యాక్టివ్‌గా పనిచేశారన్నారు. అందరితో మంచి తనంగా ఉండేవారన్నారు. ఉద్యోగ విరమణ పొందిన వీరన్న మాట్లాడుతూ తాను ఎక్కడ ఏ హోదాలో పనిచేసినా అందరి సహాయసహకారాలతో సఖ్యతగా పనిచేశానన్నారు. ప్రతి ఉద్యోగికి విరమణ అనేది సహజమన్నారు. అనంతరం వీరన్న దంపతులను జిల్లా కలెక్టర్, ఆయా శాఖల జిల్లా అధికారులు, ఈఈలు, డీఈలు, ఏఈలు, శ్రేయోభిలాషులు, బంధు, మిత్రులు, ఆప్తులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జడ్పీ సీఈఓ సుధాకర్‌రెడ్డి, పీఆర్ ఎస్ఈ రామచంద్రారెడ్డి, ఆర్‌అండ్‌బీ, హౌసింగ్ డ్వామా, ఆర్‌డబ్లుఎస్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

- డీఈఓ కార్యాలయం ఎదుట పీఆర్ఎస్ వైఎఫ్ ఆందోళన



డీఈఓ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న పీఆర్ఎస్ వైఎఫ్ ప్రతినిధులు

కడప (ఎర్రముక్కపల్లె), జూన్ 29: ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని, విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని పీఆర్ఎస్ వైఎఫ్ జిల్లా కన్వీనరు ఓరుగంటి నాగేంద్ర బాబు డిమాండ్ చేశారు. శనివారం డీఈఓ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా తమ పాఠశాలల పేర్లతో టెక్స్ బుక్కులు, నోటుబుక్కులు, మెటీరియల్ ముద్రించి మార్కెట్ ధరల కంటే మూడురెట్లు అధికంగా ఎమ్మార్పీ రేట్లు నిర్ణయించి విక్రయిస్తున్నారని ఆరోపించారు. దీనిపై విచారణ జరిపించి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీఆర్ఎస్ వైఎఫ్ జిల్లా నేతలు వేణు, సమీర్, చరణ్, వినో ద్, వెంకటేష్, సాయి, చందు, అభి, శ్రీను, అబ్దుల్లా, మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఏరువాక గంగమ్మ ఆలయం వార్షికోత్సవం





విశేష అలంకరణలో ఏరువాక గంగమ్మ అమ్మవారు - కోలాటం వేస్తున్న మహిళలు

ఎర్రగుంట్ల, జూన్ 29: శాంతినగర్‌లో వెలసిన ఏరువాక గంగమ్మ ఆలయం 27వ వార్షికోత్సవం సందర్భంగా శనివారం ఆలయంలో పూజలు వైభవంగా జరిగాయి. ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు పసుపు, కుంకుమ్మ, అమ్మవారి ప్రతిమను పంపిణీ చేశారు. మధ్యాహ్నం సుమారు 7వేల మందికి అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. సాయంత్రం ఆలయం నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు ఊరేగింపు నిర్వహించారు. మహిళల నృత్యాలు, కోలాటం ఆకట్టుకున్నాయి. టీడీపీ నియోజకవర్గం ఇన్‌చార్జి సి.భూపేష్‌రెడ్డి మధుసూదన్‌రెడి అమ్మవారిని దర్శించుకు న్నారు. భక్తులకు ఇబ్బందులు రాకుండా ఆలయ కమిటీ భారీగా ఏర్పాట్లు చేసింది.

ప్యాక్ హౌస్ బిల్లులపై వైసీపీ నిర్లక్ష్యం

రైతులకు అందని సబ్సిడీ నిధులు ● యేళ్ల తరబడి ఎదురు చూపు



మెటీరియల్‌ను పరిశీలిస్తున్న ఉద్యాన శాఖ జిల్లా అధికారి మైఖేల్ రాజీవ్ (ఫైల్)

సింహాద్రిపురం, జూన్ 29: వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంతో ఏళ్ల గడచినా ప్యాక్‌హౌస్ బిల్లులు రాకపోవడంతో రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయారు. వివరాల్లోకెళితే...

ఉద్యాన సమగ్రాభివృద్ధి మిషన్ పథకం కింద రైతులకు ప్యాక్‌హౌస్‌లను మంజూరు చేస్తారు. ఈ ప్యాక్‌హౌస్‌లను రైతులు పండించిన ఉద్యాన పంటలు గ్రేడింగ్ చేసేందుకు, వాటిని శుభ్రపరిచేందుకు, పండ్లను తాత్కాలికంగా నిల్వ ఉంచేందుకు ఉపయోగిస్తారు. ప్యాక్‌హౌస్ నిర్మాణానికి సుమారు రూ.4 నుంచి 5 లక్షలు ఖర్చవుతుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు రూ.2 లక్షలు మంజూరు చేస్తారు. కేంద్రం నుంచి నిధులు మంజూరైనా రాష్ట్ర ప్రభుత్వం తన వాటా నిధులు మంజూరు చేయకుండా ఏళ్ల తరబడి రైతులపై నిర్లక్ష్యం వహించింది. బిల్లుల మంజూరుపై ఉద్యానవన శాఖ అధికారులను రైతులు అడిగితే ఈ వారంలో బిల్లులు పడిపోతాయి అంటూ ఏళ్ల తరబడి కాలయాపన చేశారు. మండలంలో 20 మంది రైతులు బిల్లుల కోసం ఎదురు చూస్తున్నారు. మండలంలో కొన్ని ప్యాక్‌హౌస్‌లను 2023 జనవరిలో ఉద్యానవన శాఖ అధికారి మల్లేశ్వర్‌రెడ్డి విజిట్ చేసి ఓకే చేశారు. అనంతరం 6 నెలలకు 2023 జూలై 27వ తేదీన జిల్లా ఉద్యానవన శాఖ జిల్లా అధికారి మైఖేల్ రాజీవ్ ఫైనల్ విజిట్ చేసి ఆయన ఓకే చేసినట్లు రైతులు తెలిపారు. తర్వాత సబ్సిడీ మొత్తాలు మంజూరు ప్రాసెస్ జరిగింది. కానీ రైతులకు ఇంతవరకు సబ్సిడీ మొత్తం అందిన పాపాన పోలేదు. ఏళ్ల తరబడి నిధులు ఇవ్వకుండా రైతులను అన్యాయం చేసిన వైసీపీ ప్రభుత్వంపై అన్నదాతలు తీవ్ర ఆగ్రహం వ్యకం చేస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చిన సబ్సిడీ వడ్డీ చెల్లించడానికే సరిపోతోందని, రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్త ప్రభుత్వమైనా చర్యలు తీసుకుని రైతులకు బిల్లులు మంజూరు చేయాలని రైతులు కోరారు.

నిధులు కేటాయించకనే...

కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు మంజూరైనప్పటికీ వైసీపీ ప్రభుత్వం నిధులు మంజూరు చేయలేదు. దీంతో రైతులకు చెల్లించాల్సిన ప్యాక్ హౌస్‌ల సబ్సిడీ మొత్తాల్లో జాప్యం జరిగింది. బడ్జెట్ అనంతరం త్వరలోనే బిల్లులు వచ్చేలా చర్యలు తీసుకుంటాం.

- మల్లేశ్వర్‌రెడ్డి, ఉద్యానవన అధికారి

హోం మంత్రి అనితతో చమర్తి భేటీ



హోం మంత్రి అనితతో చమర్తి జగన్‌మోహన్‌రాజు

రాజంపేట, జూన్ 29 : రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనితతో రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్ మోహన్‌రాజు భేటీ అయ్యారు. గుంటూరు టీడీపీ కేంద్ర కార్యాలయంలో అనితను కలిసి ఆమె హోం మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఆమెకు అభినందనలు తెలియజేసి సత్కరించారు.

లా సెట్‌లో చిట్వేలి విద్యార్థి ప్రతిభ

చిట్వేలి, జూన్ 29 : లా సెట్ ఫలితాల్లో మండల కేంద్రమైన చిట్వేలికి చెందిన పెద్దంగారి సాయి జయకృష్ణ ఉత్తమ ప్రతిభ కనబరిచారు. శనివారం సాయి జయకృష్ణ కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు లా సెట్ ఎంట్రెన్స్‌లో 924 ర్యాంకు సాధించినట్లు తెలిపారు. 19,224 మంది పరీక్ష రాయగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన సాయిజయకృష్ణకు కుటుంబ సభ్యులతో పాటు స్థానికులు, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

కాలభైరవుడికి అభిషేకం

నందలూరు, జూన్ 29 : మండలంలోని నాగిరెడ్డిపల్లెలో నివరశిద్ధి వినాయకస్వామి ఆలయంలో శనివారం అష్టమి సందర్భంగా కాలభైరవుడికి అభిషేకం, అభయాంజనేయస్వామికి ఆకుపూజ చేశారు. ఈ సందర్భంగా అర్చకుడు రవిస్వామి మాట్లాడుతూ అష్టమిరోజున కాలభైరవుడికి పూజ చేస్తే కష్టాలు తొలగిపోతాయన్నారు.

అర్హులందరికీ పింఛన్

సిద్దవటం, జూన్ 29 : అర్హులందరికీ పెంచిన పింఛను మొత్తం అందుతుందని ఉమ్మడి కడపజిల్లా తెలుగు యువత మాజీ ఉపాధ్యక్షుడు కుప్పాల వెంకట సుబ్బయ్య తెలిపారు. శనివారం సిద్దవటంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జులై 1న పింఛను పంపిణీ కార్యాలయంలో పాల్గొని విజయవంతం చేయాలని కార్యకర్తలను కోరారు

లక్కిరెడ్డిపల్లె మండల అభివృద్ధికి చర్యలు

● మంత్రి మండిపల్లె రాంప్రసాద్ రెడ్డి



మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని సన్మానిస్తున్న టీడీపీ నేతలు, కార్యకర్తలు

లక్కిరెడ్డిపల్లె జూన్ 29: లక్కిరెడ్డిపల్లె మండలాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని మంత్రి తెలిపారు. తొలిసారిగా మండలానికి వచ్చిన ఆయన టీడీపీ నేత అమీర్ కుమార్తె వివాహానికి హాజరయ్యారు. అనంతరం కార్యకర్తలతో మాట్లాడారు. మండలాన్ని అభివృద్ధిబాటలో నడిపిస్తామన్నారు, రామాపురం-లక్కిరెడ్డిపల్లెకు బస్సు సర్వీసుకు చర్యలు తీసుకుంటామన్నారు. నాయకులు ఆరీపుల్లా, ముక్తార్, కావలి ఆంజనేయులు, డాక్టర్ షఫీనాయక్, భాస్కర్‌రెడ్డి, మల్లికార్జున, వెంకటరామరాజు, చంద్రశేఖర్, శ్రీనివాసులు, క్రాంట్రాక్టర్ వెంకటరామరాజు తదితరులు పాల్గొన్నారు

రాయచోటిటౌన్: స్థానిక ఎస్ఎన్ కాలనీలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శనివారం రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, ప్రజా దర్బార్ నిర్వహిచారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పలువురు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పూలబొకేలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పట్టణంలోని మాసాపేట సమీపంలో మనం సంస్థ ఏర్పాటు చేసిన అంబులెన్స్ సర్వీసులను సందర్శించారు. ఈ సంస్థ సేవా కార్యక్రమాలు మరింత ముందుకు తీసుకెళ్లేందుకు భవిష్యత్తులో తనవంతు సహాయ, సహకారాలు అందిస్తామన్నారు. రాయచోటి ఎమ్మెల్యేగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రవాణా యువజన క్రీడాశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టేందుకు అవకాశం ఇచ్చిన రాయచోటి ప్రజల రుణం తీర్చుకోలేనిదన్నారు. అనంతరం మనం సంస్థ సభ్యులు కేక్ కట్ చేసి మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డికి హార్థిక శుభాకాంక్షలు తెలియజేశారు.

ఒంటిమిట్ట : మండలంలోని పలువురు టీడీపీ నాయకులు రాష్ట్ర క్రీడలు, యువజనశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. సీనియర్ టీడీపీ నాయకులు కొమరా వెంకట నరసయ్య ఆధ్వర్యంలో శనివారం రాయచోటిలోని ఆయన స్వగృహంలో కలిసి శుభాకాంక్షలు తెలియజేశారన్నారు. రాబోయే రోజుల్లో గ్రామ స్థాయిలో టీడీపీ కార్యకర్తలందరినీ ఆదుకుంటామని, ప్రతి కార్యకర్తకు న్యాయం జరిగేలా క్షేత్రస్థాయిలో టీడీపీ అభివృద్ధికి కృషి చేయాలన్నారని టీడీపీ నాయకులు అన్నారు. ఈ కార్యక్రమంలో మావిళ్ల శ్రీహరి, మోదుగుల నరసింహులు, అడ్వకేట్ ఆదినారాయణ, మావిళ్ల కృష్ణయ్య, దున్నపోతుల రఘురామిరెడ్డి, కొత్తపల్లి మురళీమోహన్, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

రామాపురం: రోడ్డు ప్రమాదంలో గాయపడి విశ్రాంతి తీసుకుంటున్న ముసలరెడ్డిగారిపల్లెకు చెందిన టీడీపీ నాయకుడు గాలివీటి సురేంద్ర కుమార్ రెడ్డిని రాష్ట్ర మంత్రి మండిపల్లె రాంప్రసాద్ రెడ్డి శనివారం పరామర్శించి ధైర్యం చెప్పారు. ఆయన వెంట టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'గాలేరు-నగరి కాలువ పనుల పూర్తి' కి కృషి

● ఎమ్మెల్యే అరవ శ్రీధర్, టీడీపీ ఇన్‌చార్జి ముక్కా



ఎమ్మెల్యే శ్రీధర్, టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డిలను సన్మానిస్తున్న జీవీ పురం గ్రామస్థులు

రైల్వేకోడూరు, జూన్ 29: గాలేరు-నగరి కాలువ పనులు పూర్తి చేసేందుకు తమ వంతు కృషి చేస్తామని, ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకుంటామని రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్, టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డి తెలిపారు. శనివారం రైల్వేకోడూరు టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ రైల్వేకోడూరు-వెంకటగిరి రోడ్డుతోపాటు, నియోజకవర్గంలోని రోడ్ల నిర్మాణాలు ఐదేళ్లలో పూర్తి చేస్తామన్నారు. రైల్వేకోడూరు, ఓబులవారిపల్లె, చిట్వేలి, పెనగలూరు, పుల్లంపేట మండలాల్లోని గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. డ్రైనేజి వ్యవస్థ అభివృద్ధి చేస్తామన్నారు. ఉద్యాన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పిస్తామన్నారు. రైల్వేకోడూరులో పార్కును ఏర్పాటు చేసామన్నారు. ఆర్టీసీ బస్టాండు రూపురేఖలు మారుస్తామన్నారు. కోడూరును అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి

ఓబులవారిపల్లె : మండలంలోని జీవీ పురం దళితవాడకు చెందిన పలువురు శనివారం ఎమ్మెల్యే అరవ శ్రీధర్, రైల్వేకోడూరు తెలుగుదేశంపార్టీ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డిని కలిశారు. ముందుగా వారికి శాలువా కప్పి సన్మానించారు. అనంతరం వారి గ్రామాలకు సంబంధించిన రోడ్డు, తాగునీటి సమస్యలపై విన్నవించారు. ఈ కార్యక్రమంలో అంబేడ్కర్ సేవాసమితి రాష్ట్ర అధ్యక్షుడు పోలంరెడ్డి మల్లికార్జున, మాజీ సర్పంచ్ భర్త సాలవ చిన్నయ్య, యువకులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్‌ను కలసిన పంతగాని



ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో మాట్లాడుతున్న పంతగాని కుటుంబ సభ్యులు

రైల్వేకోడూరు, జూన్ 29: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌ను శనివారం విజయవాడలో టీడీపీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పంతగాని నరసింహప్రసాద్ కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వేకోడూరు నియోజకవర్గంలో ఉన్న సమస్యలు తదితరాలపై చర్చించామన్నారు. పంతగాని సతీమణి ప్రముఖ వైద్యురాలు నీలిమ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ హయాంలోనే రైతాంగానికి పెద్దపీట



టార్పాలిన్లు, డ్రమ్ములను పంపిణీ చేస్తున్న హరితారెడ్డి



రైతులకు పట్టలు, డ్రమ్ములు అందజేస్తున్న ప్రకృతి వ్యవసాయ అధికారులు

లక్కిరెడ్డిపల్లె జూన్ 29: తెలుగుదేశం ప్రభుత్వంలో రైతాంగానికి పెద్దపీట వేశారని ఎంపీటీసీ మాజీ సభ్యుడు మదన్ మోహన్ ఆరీఫుల్లా తెలిపారు. శనివారం లక్కిరెడ్డిపల్లె రైతు భరోసా కేంద్రంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులకు పట్టలు, డ్రమ్ములు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హయాంలోనే ప్రకృతి వ్యవసాయం కార్యక్రమం ప్రవేశపెట్టారని, ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయంపై మొగ్గుచూపాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ అధికారి నాగార్జున, టీడీపీ పార్లమెంటు డాక్టర్ల సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ షఫీనాయక్, సీనియర్ నాయకులు సిద్దక వెంకటరామిరెడ్డి, వెంకటరామరాజు, ఉమామహేశ్వర్‌రెడ్డి, సురేంద్రరాజు సంజీవరాజు, మల్లికార్జున, మండ్ల రామాంజనేయులు, వేమయ్య, శివ తదితరులు పాల్గొన్నారు

చిన్నమండెం: ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు ఎస్సీ కార్పొరేషన్‌ద్వారా మంజూరైన టార్పాలిన్లు, డ్రమ్ములను శనివారం మంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి సతీమణి హరితారెడ్డి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది చందురెడ్డి, పద్మావతి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

THE CHITTOOR DISTRICT CO-OPERATIVE CENTRAL BANK Ltd., CHITTOOR

AUDITED FINANCIAL RESULTS FOR THE YEAR ENDED 31st MARCH 2024

BALANCE SHEET FOR THE YEAR 2023-2024 (Amt in Rs.)

LIABILITIES	As on 31/03/2024	As on 31/03/2023
Capital	87,39,30,670.00	84,16,93,657.11
Reserves and Surplus	1,72,47,42,343.79	1,70,83,34,072.19
Deposits	9,32,14,44,193.01	8,57,13,08,228.98
Borrowings	11,75,27,52,743.00	7,78,38,96,488.00
Other liabilities and provisions	1,54,10,22,069.90	1,25,87,09,177.15
TOTAL	**25,21,38,92,019.70**	**20,16,39,41,623.43**
ASSETS		
Cash and balances with Reserve Bank of India	20,84,73,150.00	17,95,20,904.00
Balance with banks and money at call and short notice	2,12,11,51,415.48	1,57,56,64,558.98
Investments	2,35,23,28,500.00	2,14,89,72,024.00
Advances	20,02,25,45,000.30	15,63,62,28,323.40
Fixed Assets	13,97,77,867.94	12,28,33,545.56
Other Assets	36,96,16,085.98	50,07,22,267.49
TOTAL	**25,21,38,92,019.70**	**20,16,39,41,623.43**
Contingent Liabilities	6,19,95,978.80	1,40,54,260.93
PROFIT AND LOSS ACCOUNT FOR THE YEAR ENDED 31/03/2024 (Amt. in Rs)		
INCOME		
Interest earned	1,77,03,63,231.51	1,45,25,95,100.78
Other income	9,60,49,965.78	6,98,23,974.95
TOTAL	**1,86,64,13,197.29**	**1,52,24,19,075.73**
EXPENDITURE		
Interest expended	1,28,96,23,798.69	99,22,16,697.07
Operating expenses	40,13,54,311.76	33,40,58,265.51
Provisions and contingencies	3,63,36,382.86	4,43,41,380.15
TOTAL	**1,72,73,14,493.31**	**1,37,06,16,342.73**
PROFIT	**13,90,98,703.98**	**15,18,02,733.00**
Income Tax	4,25,00,000.00	4,00,00,000.00
TOTAL	**9,65,98,703.98**	**11,18,02,733.00**
APPROPRIATIONS		
Transfer to statutory reserves	4,82,99,351.99	6,70,81,640.00
Agrl. Credit stabilisation fund	1,42,470.00	1,38,320.00
Dividend equilisation fund	1,44,89,805.60	1,67,70,410.00
Education fund	60,000.00	60,000.00
Investment Fluctuation fund	96,59,870.40	1,09,81,953.00
Common good fund	96,59,870.40	1,11,80,273.00
Building Fund	48,29,935.20	55,90,137.00
Technology Development Fund	94,57,400.39	0.00

B.JANARDHANA REDDY
Mohan Sampath & Janardhana
Chartered Accountant

E.MANOHAR GOUD
Chief Executive Officer

** Financial statements are yet to be adopted by General Body of the bank*

రాజీమార్గమే రాజమార్గం



లోక్ అదాలత్‌లో పాల్గొన్న జడ్జి ఫైజున్నీసా

లక్కిరెడ్డిపల్లె జూన్29: చిన్న గొడవలకు పోలీసు స్టేషన్‌కు కోర్టులకు వెళ్లకుండా రాజీమార్గమే మంచిదని లక్కిరెడ్డిపల్లె కోర్టు సివిల్ జడ్జి షేక్ ఫైజున్నీసా తెలిపారు. శనివారం లక్కిరెడ్డిపల్లె కోర్టులో జాతీయ లోక్‌అదాలత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మొండి బకాయిలు, పాత కేసులు, సివిల్ కేసులు రాజీ మార్గంలో పరిష్కారం అయ్యాయి. ఈ సందర్భంగా మొండి బకాయిలు 28,59,002 రూపాయలు వసూలైందని కోర్టు వర్గాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నచిన్న గొడవలతో కుటుంబాలు వీధిపాలు కాకుండా చూసుకోవాలని, క్షణికావేశం తగ్గించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు ఎంఎల్ రామచంద్రారెడ్డి, చెన్నకృష్ణయ్య, రెడ్డెన్న , బాలాజిరెడ్డి, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

అనుమతి తీసుకోకుండా విధులకు డుమ్మా!

● గ్రామ పంచాయతీ కార్యదర్శి తీరుపై ఎంపీడీవోకు ఫిర్యాదు



మూసిఉన్న అనంతంపల్లె కార్యదర్శి గది

పెనగలూరు, జూన్ 29 : మండలంలోని అనంతంపల్లె గ్రామ పంచాయతీ కార్యదర్శి సునీత శనివారం ఉన్నతాధికారుల అనుమతి తీసుకోకుండా విధులకు గైర్హాజరైందని అనంతంపల్లె వార్డు మెంబర్ సుదర్శన్ నాయుడు శనివారం ఎంపీడీవో హరిప్రసాద్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. ఆమె విధులకు హాజరుకాకపోవడంతో తాను సాటి ఉద్యోగులను విచారణ చేసినట్లు తెలిపారు. ఈ విషయంపై ఎంపీడీవో హరిప్రసాద్‌రెడ్డిని ఫిర్యాదు చేయగా, ఆమె విధులకు రాని విషయం తనకు తెలియదన్నారు. తన నుంచి అనుమతి కూడా తీసుకోలేదని చెప్పారు. కాగా, మండలంలోని అన్ని గ్రామాల్లో సచివాలయ సిబ్బంది ఎంతమంది హాజరయ్యారు. గైర్హాజరయ్యారు, ఎవరు అనుమతి తీసుకున్నారన్న విషయం పరిశీలించాల్సిన అధికారి కుంటిసాకులు చెప్పడం భావ్యంగా లేదన్నారు. ఈ విషయంపై ఎంపీడీవో హరిప్రసాద్‌రెడ్డిని వివరణ కోరగా కార్యదర్శి విధులకు రాని విషయం గ్రామస్థులు చెప్పేంతవరకు తనకు తెలియదన్నారు. ఆమెకు ఏ వ్యక్తిగత పనులు ఉన్నాయో ఏమోనని సమాధానం చెప్పారు. దీనిపై కలెక్టర్ చర్యలు తీసుకొని సచివాలయ సిబ్బందిని గాడిలో పెట్టాలని ఈ సందర్భంగా వార్డుమెంబర్ సుదర్శన్‌నాయుడు ప్రభుత్వాన్ని కోరారు.

బస్టాండులో వసతులు కల్పించండి



అపరిశుభ్రంగా ఉన్న బాత్‌రూంలు

చిట్వేలి, జూన్ 29 : చిట్వేలిలో ఆర్టీసీ బస్టాండులో కనీస వసతులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. బస్టాండులో తాగునీరు, మరుగుదొడ్లు లేకపోవడంపై సుదూర ప్రాంతాల నుంచి వస్తున్న ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అపరిశుభ్రంగా ఉన్న మరుగుదొడ్ల కారణంగా బస్టాండు ఆవరణ దుర్గంధభరితంగా మారింది. ఆర్టీసీ అధికారులు గుర్తించి కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

'దుల్హన్' పునరుద్ధరణ మైనార్టీలకు వరం



మాట్లాడుతున్న అబూబకర్ తదితరులు

రాజంపేట, జూన్ 29: దుల్హన్ పథకాన్ని పునరుద్ధరిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జీవో జారీ చేయడం ముస్లింలకు వరం లాంటిదని రాజంపేట పట్టణ టీడీపీ ప్రధాన కార్యదర్శి అబూబకర్, మైనార్టీ ప్రధాన కార్యదర్శి ఎస్‌కె సలీం, సీనియర్ నాయకులు అష్రఫ్‌ఖాన్, తుపాకుల బాషా తెలిపారు. శనివారం రాజంపేటలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం పదో తరగతి ఉత్తీర్ణత నిబంధన పెట్టడంతో అధిక శాతం దుల్హన్ పథకానికి అనర్హులయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ హయాంలో ఈ పథకం కింద 48,963 మంది ముస్లింలు లబ్ధి పొందారన్నారు. జగన్ హయాంలో ఈ పథకాన్ని రద్దు చేసి ఇబ్బందుల పాలు చేశారన్నారు. ప్రస్తుతం టీడీపీ ప్రభుత్వం ఈ పథకాన్ని పునరుద్ధరించడంతో ఎంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు.

తుమ్మకొండలో వైద్యసేవలు అందించండి

చిట్వేలి, జూన్ 29: చిట్వేలి మండలం తుమ్మకొండలో కామెర్ల వ్యాధితో బాధపడుతున్న ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని జిల్లా బీజేపీ అధ్యక్షుడు సాయి లోకేశ్ కుమార్ శనివారం ఓ ప్రకటనలో కోరారు. ఈ విషయమై జిల్లా వైద్యాధికారి కొండయ్యతో చర్చించినట్లు తెలిపారు. ఎక్కువ మందికి ఒకేసారి కామెర్లు సోకడంపై ఆందోళన వ్యక్తం చేశారు. వ్యాధిగ్రస్తులకు అవసరమైన చేయూత ఇవ్వనున్నామని తెలిపారు. అవసరమైతే ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌తో చర్చించి మెరుగైన వైద్యసేవల ఏర్పాటుకు సహకరిస్తానని ఆయన తెలిపారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో రక్తదానం



రక్తదానం చేస్తున్న సీఐటీయూ నేతలు

రాయచోటిటౌన్, జూన్ 29: పట్టణంలోని ఏరియా ప్రభుత్వాసుపత్రికి సీఐటీయూ నేతలు, కార్మికులు 20 యూనిట్ల రక్తాన్ని అందజేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సీఐటీయూ వ్యవస్థాపకుడు పర్స సత్యనారాయణ శతజయంతి సందర్భంగా శనివారం సీఐటీయూ అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్బవరం రామాంజులు ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ వాసుబాబు, వంద పడకల ప్రభుత్వాసుపత్రి డైరెక్టర్ డాక్టర్ మహేశ్వర్‌రాజు మాట్లాడుతూ సీఐటీయూతో పాటు యువత రక్తం దానం చేయడానికి నడుం బిగించాలన్నారు. అనంతరం సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజులు రక్తదాతలకు ధన్యవాదాలు తెలియజేశారు. భవిష్యత్‌లో జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా రక్తదాన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి డీ. భాగ్యలక్ష్మి, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జాబీర్, రాజారమేశ్, కేవీపీఎస్ కోకన్వీనర్ వెంకటయ్య, రైతు సంఘం ఉపాధ్యక్షుడు నాగబసిరెడ్డి, విద్యుత్ రంగం నాయకులు సుబ్రమణ్యంరాజు, మున్సిపల్ నాయకులు చెన్నయ్య, అశోక్, బీవీ రమణ, హమాలీ సంఘం నాయకులు మాధవయ్య, గ్రీన్ అంబాసిడర్స్ జిల్లా అధ్యక్షుడు శేఖర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడిని రక్షించుకుందాం : యూటీఎఫ్

రాయచోటిటౌన్, జూన్ 29: ప్రభుత్వ బడిని రక్షించుకుందాం- ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పిద్దామని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జాబీర్ పిలుపు నిచ్చారు. పట్టణంలోని ఉర్దూ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ బడుల బలోపేతంపై శనివారం కరపత్రాల్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ బడిలో నైతిక విలువలు, చదువు, సంస్కారం, దేశభక్తి, సమానత్వ భావనలు ఏర్పడేలా విద్యాబుద్ధులు నేర్పిస్తామని, అటువంటి బడిని ఉపాధ్యాయులు కాపాడుకొని సమాజాభివృద్ధికి అంకితం కావాలని పిలుపునిచ్చారు. బడిబయట ఉన్న పిల్లలను బడిలో చేర్పించడం, ప్రభుత్వ బడిలోని సౌకర్యాలను తల్లిదండ్రులకు తెలియజేసి వారి పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించి ఊరి బడిని ఉన్నతమైన స్థితికి తీసుకువెళ్లేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాయచోటి మండల ప్రధాన కార్యదర్శ రాజారమేశ్, చాన్‌బాషా, జయన్న, రహంతుల్లా, మహమ్మద్‌ఇలియాస్, జగదీస్, రాజబాబు పాల్గొన్నారు.

1న ఇంటి వద్దనే పెన్షన్!

సుండుపల్లె, జూన్ 29: సచివాలయ ఉద్యోగులు జూలై 1న ఇంటి వద్దనే పెన్షన్ పంపిణీ చేస్తారని ఎంపీడీవో అమరనాథ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పెన్షన్‌దారులు ఎవరూ సచివాలయం వద్దకు వెళ్లాల్సిన పని లేదని, పెరిగిన పెన్షన్ మొత్తాన్ని ఇంటి వద్దనే అందజేస్తామని ఆయన స్పష్టం చేశారు.

పెనగలూరు: పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు తప్పనిసరిగా పాల్గొనాలని క్లస్టర్ ఇన్‌చార్జి నాగేశ్వరరావునాయుడు జిల్లా టీడీపీఅధికార ప్రతినిధి కొత్త బాలకృష్ణ, క్లస్టర్ తెలుగు యువత ఉపాధ్యక్షుడు నాగినేని రాంప్రసాద్‌నాయుడు కోరారు. కార్యక్రమం ప్రశాంతంగా జరిగేవిధంగా సచివాలయ సిబ్బందికి సహకరించాలని కోరారు.

తుమ్మకొండలో పారిశుధ్య పనులు



గ్రామంలో పారిశుధ్య పనులు చేస్తున్న సిబ్బంది

చిట్వేలి, జూన్ 29 : చిట్వేలి తుమ్మకొండ గ్రామంలో పారిశుధ్య పనులు నిర్వహించినట్లు పంచాయతీ కార్యదర్శి నూరి తెలిపారు. శనివారం గ్రామంలోని ప్రతి వీధిలో పిచ్చిమొక్కలను తొలగించి, గుంతలను పూడ్చామన్నారు. త్వరలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రెడ్డయ్య, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయుడికి సన్మానం



శ్రీరాములరెడ్డిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

నందలూరు, జూన్ 29 : మండలంలోని చింతకాయలపల్లె మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీరాములరెడ్డి సేవలు ఎనలేని వని ఎంఈవోలు నాగయ్య, అనంతకృష్ణ తెలిపారు. శనివారం పదవీ విరమణ చేసిన శ్రీరాములరెడ్డిని స్థానిక ఎంఆర్‌సీలో ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీరాములరెడ్డి వృత్తి పట్ల అంకితభావంతో పనిచేశారని, అతను చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్య క్రమంలో ఉపాధ్యాయ సంఘ నాయకులు మహంకాళయ్య, షేక్ రౌఫ్‌బాషా, లీలాకృష్ణయ్య, కృపానందం, మహేష్‌బాబు, వెంకట సుబ్బయ్య, కె.రమేష్‌జోషి, హరినాథ్, మండలంలోని ఉపాధ్యా యులు తదితరులు పాల్గొన్నారు.

5 నుంచి మూడు మండలాల స్థాయి క్రికెట్ టోర్నమెంట్

నందలూరు, జూన్ 29 : మండలంలోని నందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో తుంటి యానాదయ్య, సరోజమ్మ జ్ఞాపకార్థం వారి కుమారుడు నందా యాదవ్ ఆధ్వర్యంలో నందలూరు, ఒంటిమిట్ట, సిద్దవటం మండలాల స్థాయిలో నందలూరు ప్రీమియర్ లీగ్ 9వ సీజన్ హార్డ్ టెన్నిస్‌బాల్ క్రికెట్ టోర్నమెంట్ జూలై 5వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు ఆర్గనైజర్ పల్లె గ్రీష్మంత్‌రెడ్డి తెలిపారు. ఆసక్తి గల టీమ్‌లు 1300 రూపాయలు ఎంట్రీ ఫీజు చెల్లించి జులై 3వ తేదీ లోపు జట్టు వివరాలను నమోదు చేసుకోవాలని కోరారు. ఈ టోర్నమెంట్‌లో విజేతగా నిలిచినవారికి మొదటి బహుమతి కింద 40 వేలు, ద్వితీయ బహుమతి కింద 25 వేల రూపాయలు ఇవ్వనున్నట్లు వివరించారు. వివరాలకు 9000527227, 9676334033 ఈ నంబర్లను సంప్రదించాలన్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో షెడ్డు దగ్ధం



దగ్ధమైన షెడ్డును పరిశీలిస్తున్న వీఆర్వో

సిద్దవటం, జూన్ 29 : సిద్దవటం మండలం రామస్వామిపల్లెలో శుక్రవారం సాయంత్రం యాకసిరి సుబ్బమ్మ అనే మహిళ రేకుల షెడ్ విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నికి ఆహుతైంది. ఇంటిలోని సామాను, నిత్యావసర సరుకు ఇతర సామగ్రి బూడిదపాలైంది. శనివారం వీఆర్వో నాని సంఘటన స్థలాన్ని పరిశీలించారు. నష్టం వివరాలను తహసీల్దారుకు విన్నవిస్తామని, ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని బాధితురాలు యాకసిరి సుబ్బమ్మకు భరోసా ఇచ్చారు.

కారు ఢీకొని ఇరువురికి గాయాలు

పుల్లంపేట, జూన్ 29 : స్థానిక బైపాస్‌రోడ్డులో ఆగి ఉన్న కారును ఢీకొని శనివారం ఇరువురు గాయపడ్డారు. ఓబులవారిపల్లె మండలానికి చెందిన కొప్పల దినేష్, మడగలం కిషోర్‌లు బైకుపై రాజంపేట నుంచి స్వగ్రామానికి వెళుతూ పుల్లంపేట కల్యాణ మండపం వద్ద ఆగి ఉన్న కారును బలంగా ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో కొప్పల దినేష్ తీవ్రంగా గాయపడగా మడగలం కిషోర్ స్వల్పంగా గాయపడ్డారు. గాయపడినవారిని రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రఘురాం తెలిపారు.

‘నవోదయ’ ఫలితాల్లో ‘విశ్వం’ ప్రభంజనం


సాత్విక, మహిత, యుగంధర్, యశ్వంత్, లక్ష్మీనారాయణ

తిరుపతి(విద్య), జూన్ 29: జాతీయస్థాయిలో జవహర్ నవోదయ విద్యాలయాల్లో 2024-25 విద్యాసంవత్సరానికి 11వ తరగతిలో ప్రవేశాలకోసం నిర్వహించిన పరీక్ష ఫలితాల్లో తిరుపతికి చెందిన విశ్వం విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని ఆ స్కూల్ ఛైర్మన్, కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి తెలిపారు. తమ విద్యార్థులు ఎం.యశ్వంత్, ఆర్.మహిత, ఎ.యుగంధర్, పి.సాత్విక, పి.లక్ష్మీనారాయణ.. సీట్లు సాధించారన్నారు. అలాగే ఈ విద్యా సంవత్సరంలో 6, 9 తరగతుల ప్రవేశ పరీక్ష ఫలితాల్లోనూ గంగాజైదీప్‌రెడ్డి, లాస్య, లిఖిత, ఉదయశ్రీ, లక్ష్మీ, కేతన్‌భాస్కర్, జ్యోత్స్న, గౌతమ్‌కుమార్, హేమంత్, కేథన్, హాసినిలతోపాటు మొత్తం 48మంది విద్యార్థులు సీట్లు సాధించి సత్తా చాటారని వివరించారు. ప్రతిభ చూపిన విద్యార్థులను కరస్పాండెంట్ ఎన్.తులసీవిశ్వనాథ్, అకడమిక్ డైరెక్టర్ ఎన్.విశ్వచందన్‌రెడ్డి, విశ్వశ్రీ, టీచర్లతో కలిసి అభినందించారు.

రెండు నెలలు ‘స్టాప్ డయేరియల్ క్యాంపెయిన్’


గోడపత్రికను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 29: రానున్న రెండు నెలలు స్టాప్ డయేరియల్ క్యాంపెయిన్ నిర్వహించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. శనివారం రాత్రి కలెక్టరేట్‌లో ఇందుకు సంబంధించిన గోడపత్రికను వైద్యాధికారులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఇంటింటి సర్వే చేసి ఐదేళ్లలోపు పిల్లలకు రెండేసి ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందించాలని సూచించారు. విరేచనాలతో బాధపడే పిల్లలకు ఓఆర్ఎస్‌తో పాటు 14 రోజులకు సరిపడే జింక్ మాత్రలు అందించాలన్నారు. అత్యవసర పరిస్థితి ఏర్పడితే చిన్నారులను వైద్యులకు రెఫర్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో ప్రభావతి దేవి, డీఐవో డాక్టర్ వెంకటప్రసాద్, పీఎంవో అనిల్, ప్రోగ్రామ్ ఆఫీసర్లు హర్షవర్ధన్, శ్రీనివాసులు, జయరాములు, శ్రీవాణి పాల్గొన్నారు.

ఈవీఎం, వీవీప్యాట్లకు కట్టుదిట్టమైన భద్రత


గోదామును తనిఖీ చేస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 29: కలెక్టరేట్‌లో ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ (ఈవీఎం), వీవీప్యాట్లను ఉంచిన గోదాములకు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. శనివారం ఆయన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలసి గోదాములను పరిశీలించారు. ఈవీఎంల భద్రత, సీసీ కెమెరాల పనితీరును టెక్నికల్ అసిస్టెంట్ ఉమాపతి నాయుడు కలెక్టర్‌కు వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈసీ సూచనల మేరకు మూడునెలలకోసారి రాజకీయ ప్రతినిధుల సమక్షంలో తనిఖీలు చేస్తున్నామన్నారు. వర్షాకాలం తగు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు వివరించారు. డీఆర్వో పుల్లయ్య, రాజకీయ ప్రతినిధులు పరదేశి (కాంగ్రెస్), సురేంద్రకుమార్ (టీడీపీ), అట్లూరి శ్రీనివాసులు (బీజేపీ), ఉదయ్‌కుమార్ (వైసీపీ), గంగరాజు (సీపీఎం), ఎన్నికల విభాగ అధికారులు వారి వెంట ఉన్నారు.

‘ఎవరు గెలిచినా మీదే గెలుపు’ విజేతలకు బహుమతులు అందజేత



తిరుపతి, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): శాసనసభ ఎన్నికల్లో ఎవరు గెలుస్తారు అనే అంశంపై ఆంధ్రజ్యోతి నిర్వహించిన లక్కీడ్రా విజేతలకు శనివారం ఆంధ్రజ్యోతి యూనిట్ కార్యాలయంలో నగదు బహుమతులను అందజేశారు.ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 14 అసెంబ్లీ స్థానాల్లో ఏ పార్టీ అత్యధిక స్థానాలు గెలుపొందుతుందో పాఠకుల అంచనాలతో కూపన్లు ఆహ్వానించిన విషయం తెలిసిందే. అలావచ్చిన వేలాదికూపన్లనుంచి ఇటీవల లక్కీ డ్రా ద్వారా విజేతలను ఎంపికచేశారు. తిరుపతిలోని చంద్రబాబు నాయుడు కాలనీకి చెందిన పి.శ్రీనివాసులు ప్రథమ బహుమతిని, అలాగే మూడు ద్వితీయ బహుమతులను తిరుచానూరు శంకర్ నాయుడు కాలనీకి చెందిన సీఆర్ ఖాదర్ బాషా, తిరుపతిలోని కుమ్మరతోపుకు చెందిన వి.మురళీకృష్ణ, చిత్తూరు గ్రీమ్స్‌పేటలోని గాయత్రీనగర్‌కు చెందిన ఈఎం ప్రసాద్‌లకు అందజేశారు. రాష్ట్రస్థాయి పోటీలో గెలుపొందిన ఐరాలకు చెందిన పుల్లూరు మాధవన్ కూడా నగదు బహుమతి స్వీకరించారు.బ్రాంచ్ మేనేజర్ సురేష్ రెడ్డి, సర్క్యులేషన్ మేనేజర్ ఉమాపతి తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ ఈడీపీ ఆఫీస్‌లో ఏసీ గ్యాస్ లీకేజీతో కలకలం

తిరుమల, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): తిరుమలలోని టీటీడీ ఈడీపీ ఆఫీస్‌లో ఏసీ నుంచి గ్యాస్ లీక్ కావడం కలకలం సృష్టించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్ వద్దనున్న ఈడీపీ ఆఫీస్‌లో శ్రీవారి దర్శన, ఆర్జితసేవల టికెట్లు, గదుల కేటాయింపు వంటి సమాచారాన్ని పొందుపరుస్తారు. శనివారం ఉదయం ఈడీపీ ఆఫీస్‌లోని ఓ ఏసీ కంప్రెసర్ నుంచి గ్యాస్ లీక్ కావడంతో ఫైర్ అలారం మోగింది. దీంతో విధుల్లోని సిబ్బంది ముందు జాగ్రత్తగా ఫైర్ స్టేషన్ అధికారులకు సమాచారమిచ్చారు. హుటాహుటిన ఫైర్ ఇంజన్‌తో సిబ్బంది ఘటనాప్రాంతానికి చేరుకుని ఏసీని పరిశీలించారు. ఏసీ నుంచి గ్యాస్ మాత్రమే లీకయ్యిందని, ఎలాంటి అగ్నిప్రమాదం జరగలేదని చెప్పడంతో ఈడీపీ కార్యాలయ సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు. గత ప్రభుత్వంలో దర్శన, ఆర్జితసేవా టికెట్ల కేటాయింపులో భారీ అవినీతి జరిగిందనే ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ఇటీవల స్టేట్ విజిలెన్స్ బృందం సోదాలు చేసి పలు రికార్డులను తీసుకున్న విషయం తెలిసిందే. ఈక్రమంలో ఏసీ నుంచి గ్యాస్ లీక్ కావడం చర్చనీయాంశమైంది. ఈ ఘటనపై విజిలెన్స్ అధికారులు విచారిస్తున్నట్టు సమాచారం.

రైతాంగానికి ఇబ్బంది లేకుండా
విద్యుత్ సరఫరా చేస్తాం
ఎస్ఈ సురేంద్ర నాయుడు



తిరుపతి(ఆటోనగర్), జూన్ 29: ఉమ్మడి చిత్తూరు జిల్లాలో రైతాంగానికి ఇబ్బంది లేకుండా విద్యుత్ సరఫరా చేస్తామని సూపరింటెండెంట్ ఇంజనీరు (ఎస్ఈ) పి.సురేంద్ర నాయుడు వెల్లడించారు. తిరుపతిలోని తన కార్యాలయంలో శనివారం సాయంత్రం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రస్తుతం ఏడు గంటలు విద్యుత్ సరఫరా చేస్తున్నామన్నారు. రైతుల కోరిక మేరకు రెండు విడతలుగా సరఫరా చేస్తున్నాయని చెప్పారు. కుప్పం నియోజకవర్గంలో ఏ గ్రూపులో రోజూ ఉదయం8.30 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు, రాత్రి12 నుంచి2.30 గంటల వరకు సరఫరా చేస్తున్నామన్నారు. అదే బీ గ్రూపులో మధ్యాహ్నం 1.30 నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు, రాత్రి రెండు గంటల నుంచి తెల్లవారుజామున నాలుగు గంటల వరకు విద్యుత్ సరఫరా జరుగుతోందని వివరించారు. రైతుల కోరిక మేరకే రాత్రి సమయంలో విద్యుత్ సరఫరా చేస్తున్నామని స్పష్టం చేశారు. జిల్లా మొత్తం ఏ గ్రూపులో ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 3.30 గంటల వరకు, బీ గ్రూపులో ఉదయం 11 నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు విద్యుత్ సరఫరా జరుగుతోందన్నారు. జిల్లాలో 1,133 వ్యవసాయ విద్యుత్ ఫీడర్లు ఉన్నాయన్నారు. పగలు 675, రాత్రి 485 ఫీడర్ల ద్వారా విద్యుత్ సరఫరా జరుగుతున్నట్లు తెలియజేశారు. 6,184 మంది రైతులు విద్యుత్ కనెక్షన్ల కోసం దరఖాస్తు చేసుకున్నారని, త్వరలోనే మంజూరు చేస్తామన్నారు. హెచ్‌టీ, ఎల్‌టీ పరిశ్రమలకు జూలై నెలాఖరులోపు విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేస్తామని వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ తీగల సమస్యలు ఉంటే సమీప సబ్‌స్టేషన్లలోని ఫిర్యాదు పుస్తకాల్లో నమోదు చేయాలని కోరారు. వినియోగదారులు తమ సమస్యలను టోల్ ఫ్రీనెంబరు 1912 ఫిర్యాదు చేయాలని సూచించారు. సమావేశంలో టెక్నికల్ ఈఈ శ్రీనివసులు పాల్గొన్నారు.

ముళ్ల పొదల్లో సబ్సిడీ వాహనాలు

- ఐదేళ్లుగా లబ్ధిదారులకు పంపిణీ చేయని వైసీపీ ప్రభుత్వం


కలెక్టరేట్‌లో ముళ్లపొదల్లో ఉన్న వాహనాలు

చిత్తూరు, జూన్ 29: గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పేద ఎస్సీలకు సబ్సిడీ కింద మంజూరైన వాహనాలు ముళ్ల పొదల్లో తుప్పు పట్టిపోతున్నాయి. ఐదేళ్ల కిందట మంజూరైన ఆ వాహనాలను పంపిణీ చేసేలోపు ఎన్నికల కోడ్ వచ్చింది. తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం వాటి గురించి పట్టించుకోలేదు. 2014-19లో టీడీపీ ప్రభుత్వం ఎస్సీలను ఆదుకోవాలనే ఉద్దేశంతో నేషనల్ షెడ్యూల్ క్యాస్ట్ కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ (ఎన్ఎస్ఎఫ్‌డీసీ) పథకం కింద కార్లు, ఎక్సకవేటర్లు, ట్రాక్టర్లు, గల్పర్లు, మిని ఎక్సకవేటర్లు మంజూరు చేసింది.2019లో ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో ఆ ఏడాది మంజూరైన వాహనాలను కలెక్టరేట్‌లో ఉంచారు.వైసీపీ అధికారంలోకి రావడంతో లబ్ధిదారులు టీడీపీ సానుభూతిపరులన్న భావనతో వాటిని పంపిణీ చేయలేదు. బెనిఫిషరీ కాంట్రిబ్యూషన్ కింద బ్యాంకుల్లో డబ్బులు చెల్లించిన లబ్ధిదారులంతా ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయాల చుట్టూ తిరిగినా పట్టించుకోలేదు.

ఆఫ్‌లైన్‌లో వైసీపీ వారికి కట్టబెట్టారు..

టీడీపీ హయాంలో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు తీసుకుని కమిటీ ఆధ్వర్యంలో లబ్ధిదారులను ఎంపిక చేసేవారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నర తర్వాత ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తులు తీసుకుని ఆ వాహనాల్లో కొన్నింటిని వైసీపీ సానుభూతిపరులకు పంపిణీ చేసేశారు. ఉమ్మడి జిల్లాకు మూడు గల్పర్లు మంజూరు కాగా రెండింటిని పుంగనూరుకు, మరొకటి తిరుపతికి తీసుకెళ్లారు.

బినామీ పేరుతో రెండు కార్లు కాజేశారు..

ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా పనిచేసిన ఓ అధికారి బినామీ పేర్లతో రెండు ఇన్నోవా కార్లను తీసుకున్నట్లు ఆ శాఖ ఉద్యోగులే చెబుతున్నారు. 2019 ఎన్నికల ఏడాది కావడంతో టీడీపీ ప్రభుత్వం వంద వరకు ఇన్నోవా కార్లను మంజూరు చేసింది. నగరి నియోజకవర్గంలో ఓ లబ్ధిదారుడు దరఖాస్తు చేసుకున్నా ఇంటర్వ్యూలో ఎంపిక కాలేదని అధికారులు చెప్పడంతో వెళ్లిపోయాడు. అయితే కొన్ని రోజుల తర్వాత అదే వ్యక్తికి కారు తీసుకున్నందుకు డ్యూ కట్టాలని ఎస్సీ కార్పొరేషన్ అధికారులు నోటీసులు పంపారు. తీసుకోని కారుకు డ్యూ ఎందుకు కట్టాలంటూ అతను అధికారులతో వాగ్వాదానికి దిగాడు. సర్దిచెప్పిన అధికారులు ఆ కారు ఎవరికి ఇచ్చారో ఇప్పటికీ తేల్చని పరిస్థితి.

పడకేసిన డబుల్ డెక్కర్ !

రూ2.5 కోట్ల ప్రజాధనం వృథా



చిన్నయ్యగారు మోజుపడి ప్రజల సొమ్ముతో కొన్న రెండంతస్తుల బస్సు షెడ్డుకు చేరింది. తిరుపతి నగరంలో ఎర్రెర్రని నిగనిగలతో డబుల్ డెక్కర్ తిరుగుతూ ఉంటే ఎక్కడానికి జనం ఎగబడతారని వేసిన అంచనా తలకిందులైంది. భూమన అభినయ్ డిప్యూటీ మేయర్‌గా ఉన్నపుడు దాదాపు రూ2.5కోట్ల ప్రజాధనం పోసి తిరుపతి కార్పొరేషన్ కొన్న ఎలక్ట్రిక్ డబుల్ డెక్కర్ బస్సు చెత్తకుప్పల్లో దొరికే పాత బొమ్మలా మారిపోయింది. గత ఏడాది ఆగస్టు 8న రూ2.30కోట్ల కార్పొరేషన్ సాధారణ నిధులతో ఈ బస్సును కొనాలని కౌన్సిల్లో ప్రతిపాదించారు. ఆగమేఘాల మీద బస్సును కొనేశారు. మరి తిప్పేదెలా అని సందేహం వచ్చింది. ఆర్టీసీకి అప్పగించి అద్దె వసూలు చేయాలనుకున్నారు. వారు నిరాకరించడంతో కార్పొరేషనే బస్సును నడిపి టికెట్లు వసూలు చేయాలని నిర్ణయించుకుంది. ఇరుకురోడ్ల నగరంలో ఇంతెత్తు బస్సు తిప్పడం కష్టం కావడంతో రాత్రికిరాత్రే రెండువేలకు పైగా చెట్ల కొమ్మలను నరికి నేలకూల్చేశారు. గత ఏడాది అక్టోబరు 12న బస్సును రోడ్డుపైకి తీసుకొచ్చారు. ఎక్కడ ఎక్కి దిగినా బస్సు ఛార్జీ రూ.50 అని నిర్ణయించారు. ఇబ్బడిముబ్బడిగా ఆదాయం వస్తుందనుకున్నారు కానీ, రోజుకు పదిమంది కూడా ఎక్కలేదు. దీంతో బస్సును కొంతకాలం ఉచితంగానే తిప్పారు.అయినా జనం ఎందుకో పెద్దగా ఎక్కలేదు. ఇంతా చేస్తే బస్సుకు రిజిస్ట్రేషనే లేదు. ఏదైనా తేడా వస్తే తమ నెత్తికి వస్తుందని భయపడి, రవాణ అధికారులు అభ్యంతరపెట్టడంతో బస్సును బయటకు తీయడం మానేశారు. ప్రస్తుతం కార్పొరేషన్ చెత్త వాహనాలు పార్క్ చేసే వినాయకసాగర్ పక్కన ఈ ఎర్రబస్సు ఈసురోమంటూ నిలబడి ఉంది.

> బస్సు పొడవు : 9 మీటర్లు
> ఎత్తు : 4.5 మీటర్లు
> వెడల్పు : 9 అడుగులు
> సీట్ల సామర్థ్యం : 65
> కొనుగోలు ధర: రూ2.14కోట్లు(6శాతం పన్ను అదనం)

4 సెట్విన్ బస్సులు వచ్చేవి

తిరుపతిలో సిటీ బస్సులే లేకుండా పోయాయి. గతంలో తిరుచానూరు, చంద్రగిరి, రేణిగుంటలకు నగరం లోపలి నుంచి సిటీ బస్సులు ఇబ్బడిముబ్బడిగా తిరిగేవి. నగరంలో ట్రాఫిక్ సమస్య పెరగడంతో వీటిని తగ్గించేశారు. జనం ఆటోల మీదే ఆధారపడే పరిస్థితి ఏర్పడింది. రూ.కోట్ల ఖర్చుతో సోకుల బస్సులు కొనే బదులు చిన్న సైజు సెట్విన్ బస్సులు కొని నగరంలో తిప్పితే ఆటోలు, బైకుల సంఖ్య కూడా తగ్గేది. ట్రాఫిక్ అవస్థలు తప్పేవి. ప్రజలకూ రవాణా అందుబాటులో ఉండేది.

- తిరుపతి,ఆంధ్రజ్యోతి

ట్రాక్టర్ ఢీకొని రైతు మృతి


చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో తులసిరామిరెడ్డి మృతదేహం

గంగాధరనెల్లూరు, జూన్ 29: ట్రాక్టర్ ఢీకొని రైతు మృతిచెందిన ఘటన మండలంలోని ఒడ్డుపల్లె చెరువుకట్టపై శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. మృతుడి భార్య చెప్పిన వివరాల మేరకు.. గంగాధరనెల్లూరు మండలం కోటాగరం పంచాయతీ ఒడ్డుపల్లె గ్రామానికి చెందిన కృష్ణారెడ్డి కుమారుడు తులసిరామిరెడ్డి(34) పొలం నుంచి ఆవులను పట్టుకుని ఇంటికి వస్తున్నాడు. చెరువుకట్టపై అదే గ్రామానికి చెందిన చిరంజీవిరెడ్డి ట్రాక్టర్‌లో వస్తున్నాడు. ట్రాక్టర్ శబ్దానికి ఆవులు బెదిరిపోయాయి. వాటిని తప్పించే క్రమంలో ట్రాక్టర్ తులసిరామిరెడ్డిని ఢీకొంది. ఆయన అక్కడికక్కడే మృతిచెందాడు. గ్రామస్తుల సమాచారం మేరకు పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి భార్య మౌనిక ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ అంజినేయులురెడ్డి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి ఐదేళ్లలోపు ఇద్దరు పిల్లలున్నారు. ఈ ఘటనతో ఒడ్డుపల్లె గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.54 కోట్లు

తిరుమల, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ3.54 కోట్లు లభించింది. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శుక్రవారం లెక్కించి, శనివారం ఉదయం ప్రకటించింది. శుక్రవారం 66,256 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 30,087 మంది తలనీలాలు సమర్పించారు.

ఏఐఎస్ఎఫ్ జాతీయ సమావేశాలు ప్రారంభం


సమావేశాల్లో ప్రసంగిస్తున్న ఈశ్వరయ్య

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 29: విద్యా కేంద్రాలన్నీ విద్యార్థి ఉద్యమ నిలయాలు కావాలని ఏఐఎస్ఎఫ్ ఉమ్మడి రాష్ట్ర మాజీ కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య పిలుపునిచ్చారు. అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) జాతీయ సమావేశాలు శనివారం తిరుపతిలో ప్రారంభమయ్యాయి. రెండ్రోజులపాటు జరిగే ఈ సమావేశాలకు ఎస్వీయూనివర్సిటీ సెనేట్ హాల్ వేదికైంది. విద్యార్థి, రైతాంగ ఉద్యమ అమరులైన అతుల్ కుమార్ అంజన్, గగన్‌దీప్ సింగ్‌లకు తొలుత సంతాపాన్ని తెలియజేశారు. ఈ సందర్భంగా ఈశ్వరయ్య మాట్లాడుతూ.. యూనివర్సిటీల్లో అధికార పార్టీకి ఊడిగం చేసేవారికి గత వైసీపీ ప్రభుత్వం పదవులు కట్టబెట్టిందని మండిపడ్డారు. ఎస్వీయూనివర్సిటీలో గతంలో ఎంపీ మిథున్‌రెడ్డి కటౌట్ ఏర్పాటు చేయడం వంటి సంఘటనలు ఉదాహరణగా చెప్పారు. వర్సిటీల్లో రాజకీయ ప్రభావాన్ని విద్యార్థులు తిప్పికొట్టాలని కోరారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ.. చట్టసభలు కోటీశ్వరులతో నిండి పోయాయన్నారు. అందువల్ల విద్యార్థులు రాజకీయాల్లోకి రావాలని సూచించారు. నీట్ వ్యవహారంపై ప్రధాని మోదీ నోరు మెదపకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందని అభిప్రాయపడ్డారు. గతంలో ఎమ్మెల్యేగా ఉన్న భూమన కరుణాకరరెడ్డి నిలువెత్తు ఫ్లెక్సీని ఎస్వీయూ పరిపాలనా భవనానికి పెట్టడం తనకు ఆశ్చర్యం కలిగించిందన్నారు. వర్సిటీల్లో ఇలాంటి సంస్కృతిని ఏ పార్టీ అధికారంలో ఉన్నా విడనాడాలని కోరారు. ఏఐఎస్ఎఫ్ జాతీయ మాజీ అధ్యక్షుడు రామకృష్ణ పాండా మాట్లాడుతూ.. ఆర్ఎస్ఎస్ అజెండాను పాఠ్యాంశాల్లోకి ప్రవేశపెడుతున్నారని, దీనిపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏఐఎస్ఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి దినేష్ శ్రీరంగరాజ్ మాట్లాడుతూ.. అతుల్‌కుమార్ అంజన్, గగన్‌దీప్ సింగ్ పోరాట పటిమ ఈ తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. ఈ సమావేశాల్లో దేశంలోని విద్యారంగ సమస్యలు, వాటి పరిష్కారానికి చేపట్టాల్సిన భవిష్యత్తు ఉద్యమ కార్యాచరణపై సుదీర్ఘంగా చర్చ జరుగుతోంది. ఏపీ రైతు సంఘం ఉపాధ్యక్షుడు రామానాయుడు, సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి, ఏఐఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షులు సంఘమిత్ర, అమీన్ హంజా, మహేష్ కుంజం, జాతీయ కార్యదర్శులు కబీర్, షాహిద్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జాన్సన్‌బాబు, శివారెడ్డి, ఉపాధ్యక్షుడు బండి చలపతి, నాయకులు ఫణీంద్ర, ఉదయ్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నవీన్, ప్రవీణ్, యూనివర్సిటీ నాయకులు చిన్న, చంద్ర, మాజీ ఏఐఎస్ఎఫ్ నాయకులు కడియాల వెంకటరమణ, ప్రసాద్, తూపల్లె జనార్దన్, మోహన్‌కుమార్‌రాజు, ప్రజా నాట్య మండలి రాష్ట్ర అధ్యక్షుడు చిన్నం పెంచలయ్య, దళిత హక్కుల పోరాట సమితి నాయకులు కాళయ్య, సీపీఐ నగర కార్యదర్శి విశ్వనాథ్, పలు రాష్ట్రాల ప్రతినిధులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

సినీ రంగం కష్టాలు తెలిసిన వ్యక్తి పవన్‌కల్యాణ్ - సినీ నటుడు సుమన్


గోవిందరాజస్వామి ఆలయంలో సుమన్

తిరుపతి అర్బన్, జూన్ 29: ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని సినీ నటుడు సుమన్ స్పష్టం చేశారు. శనివారం ఉదయం గోవిందరాజస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడారు. నిరుద్యోగులకు సొంతూళ్లలోనే ఉద్యోగ అవకాశాలు లభించేలా సీఎం కృషి చేయాలని కోరారు. సినీ పరిశ్రమలో చాలామంది ఇబ్బందుల్లో ఉన్నారని, వారిని కూడా ఆదుకోవాలన్నారు. స్టూడియోలు నిర్మిస్తే వెండి తెరతోపాటు బుల్లితెర పరిశ్రమ మరింత మెరుగుపడుతుందన్నారు. తిరుపతిని టెంపుల్‌సిటీగా ఎంపిక చేయాలని విజ్ఞప్తి చేశారు. సినీ రంగం ఎదుర్కొనే కష్టాలు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు తెలుసునన్నారు. ప్రస్తుత పరిస్థితుల నుంచి త్వరలోనే సినీ రంగం తేరుకుంటుందని విశ్వాసం వ్యక్తం చేశారు. వైసీపీకి చెందిన సినీ నటుల రాజీనామాపై స్పందిస్తూ.. అది వారి వ్యక్తిగతమన్నారు. రాజకీయాల్లో అందరినీ సంతృప్తిపరచడం చాలా కష్టమన్నారు. ఎవరికి తలరాత ఉంటే వారికి మాత్రమే పదవులు లభిస్తాయన్నారు.

ఏనుగుల సంచారంతో అటవీశాఖ అప్రమత్తం

ఏడో మైలు వద్ద 30 మంది సిబ్బంది ఏర్పాటు

మంగళం, జూన్ 29: తిరుమల మొదటి ఘాట్‌లోని ఏడో మైలు వద్ద ఏనుగుల గుంపు సంచరిస్తున్న విషయం తెలిసిన వెంటనే అటవీశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. రోడ్డుకు సమీపంలోని అటవీప్రాంతానికి ఏనుగులు శుక్రవారం రావడంతో భక్తులు ఆందోళనకు గురయ్యారు. ఇవి రోడ్డుపైకి రాకుండా అటవీశాఖ సిబ్బందిని ఈ ప్రాంతంలో ఏర్పాటు చేశారు. వీరు.. ఏనుగులు గుంపు అటువైపు రాకుండా వాటిని అడవిలోకి తరమడంతోపాటు భక్తులను అప్రమత్తం చేయనున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు 15మంది, రాత్రి నుంచి ఉదయం వరకు మరో 15మంది సిబ్బంది ఇక్కడ విధులు నిర్వహిస్తారు. వీరితోపాటు మరి కొంతమంది టీటీడీ సిబ్బంది కూడా ఉంటారు.

> **శేషాచల ప్రాంతంలోనే ఏనుగుల గుంపు**
>
> ఏడో మైలు వద్దకు వచ్చిన ఏనుగుల గుంపు శేషాచల కొండల్లోని అటవీ ప్రాంతంలోనే సంచరిస్తున్నాయి. కొంతకాలం క్రితం ఏనుగుల ఇక్కడకు వచ్చి వెళ్లాయి. అవ్వాచారి కోన సమీపంలో ఏరు ఉండటంతో సమీప ప్రాంతాల్లో తిరుగుతున్నాయి. అంతేకాకుండా ఈ ప్రాంతం ఎత్తయిన కొండలతో కాకుండా చదునుగా ఉండటం.. ఆహారం, నీరు దొరుకుతుండటంతో తరచూ ఇవి ఈ ప్రాంతానికి వస్తున్నాయి. ఏనుగులు రోడ్డుపైకి వచ్చే అవకాశం లేదని భావిస్తున్నాం. ఏదేమైనా వీటిపై నిఘా ఉంచడానికి 15మంది చొప్పున 30మందితో రెండు బృందాలను ఈ ప్రాంతంలో ఏర్పాటు చేశాం. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నాం.
>
> - శ్రీనివాసరావు, సబ్ డీఎఫ్‌వో, తిరుపతి

జాతీయ లోక్‌అదాలత్‌లో 97 కేసులు పరిష్కారం

● రూ1.26 కోట్లు పరిహారం చెల్లింపు

మదనపల్లె టౌన్, జూన్ 29: మదనపల్లె కోర్టు ఆవరణలో నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో 97 కేసులు పరిష్కారమయ్యాయి. శనివారం మదనపల్లె కోర్టు భవనాల్లో మొత్తం 9 బెంచిలు ఏర్పాటు చేయగా చిత్తూరు ఫస్ట్ అడిషనల్ జిల్లా జడ్జి(మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఛైర్మన్) ఎస్.రమేష్ ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. వాటిలో 20 సివిల్ కేసులు, 5 పీఎల్‌పీ కేసులు 60 సీసీ కేసులు, ఒక సీపీ కేసు, 4 డీవీసీ కేసులు, ఎన్‌ఐ యాక్ట్ కేసులు 7 మొత్తం కలిపి 97 కేసులు పరిష్కారమయ్యాయి. ఇందులో భాగంగా బాధితులకు రూ.1,26,45,586ను చెల్లించారు ఈ కార్యక్రమాల్లో ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లునాయక్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి విజయకుమార్‌రెడ్డి, పాల్గొన్నారు.

పీలేరులో 64 కేసులు పరిష్కారం

పీలేరు, జూన్ 29: పీలేరులో శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో 64 కేసులు పరిష్కారమయ్యాయి. పరిష్కారమైన కేసుల కారణంగా కక్షిదారులకు రూ.1.70 కోట్ల చెల్లింపులు జరిగాయి. 11వ అదనపు జిల్లా జడ్జి సుంకర శ్రీదేవి, పీలేరు సీనియర్ సివిల్ జడ్జి రవి, పీలేరు అదనపు జూనియర్ సివిల్ జడ్జి గాయత్రి మూడు బెంచులు నిర్వహించి కేసులు పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో పీలేరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బీసీ పురుషోత్తం రెడ్డి, పలువురు న్యాయవాదులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

వాల్మీకిపురంలో: వాల్మీకిపురం జూనియర్ సివిల్ కోర్టులో నిర్వహించిన జాతీయ మెగా లోక్ అదాలత్‌లో 43కేసులు పరిష్కారం కాగా, రూ.22,30,344లు వివిధ కేసులలో నగదు రికవరీలు చేశారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్ , స్థానిక జడ్జి గురు అరవింద్ సమక్షంలో సివిల్, క్రిమినల్, బ్యాంకుల రుణాలు తదితర 43 కేసులు పరిష్కరించారు. ఈసందర్భంగా జడ్జి గురు అరవింద్ మాట్లాడుతూ ప్రతి రోజు కోర్టులో జరిగే ప్రీ సిట్టింగ్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. ఈకార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆనంద్‌కుమార్, లోక్ అదాలత్ సభ్యులు ద్వారకనాథ రెడ్డి, న్యాయవాదులు, న్యాయసేవాధికార సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

తంబళ్లపల్లెలో: తంబళ్లపల్లె జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ మెగా లోక్ అదాలత్‌లో 19 కేసులు పరిష్కారమైనట్లు మండల న్యాయ సేవా సంఘం అధ్యక్షుడు, న్యాయస్థానం ఇంచార్జ్ జడ్జి శిరీష తెలిపారు. క్రిమినల్‌కు సంబంధించి 14 కేసులు, సివిల్‌కు సంబంధించి 5 కేసులు వాది ప్రతివాది ఇరువురి అంగీకారాలతో పరిష్కరించినట్లు తెలిపారు. పరిష్కారమైన కేసులకు సంబంధించి రూ. ఇరవై నాలుగు లక్షల64 వేల ఐదు వందల డెబ్బై ఆరు రూపాయలు రికవరీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీపీ రామకృష్ణ, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జనార్దన్‌రెడ్డి, లోక్ అదాలత్ అడ్వకేట్ గఫార్ సాహేబ్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

వేలం ద్వారా పంచాయతీకి భారీగా ఆదాయం

వాల్మీకిపురం, జూన్ 29: వాల్మీకిపురం గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం మదనపల్లె డీఎల్‌పీవో నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన వేలం పాటల్లో రూ.11,21,700లు భారీగా ఆదాయం లభించింది. పోటాపోటీగా సాగిన వేలం పాటల్లో వారపు సంత మొహ్మద్ హుస్సేన్ రూ.7,98,000లకు, దినసరి మార్కెట్ రవిశంకర్ రూ.2,23,000లు, జంతు వధశాల శివ రూ.1,00,700లు సొంతం చేసుకున్నారు. బస్టాండ్ గేట్ వసూళ్లకు మాత్రం పోటీ లేకపోవడంతో వేలం పాటలను నిలిపివేస్తూ తదుపరి మళ్లీ వేలం పాటలు నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ ఈవో ఉదయ్‌కుమార్, సర్పంచ్ గంగులమ్మ, ఉపసర్పంచ్ కేశవరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

టీచర్స్ కాలనీలో చోరీ

● 200 గ్రాముల బంగారం, 16 వేలు నగదు అపహరణ

మదనపల్లె అర్బన్, జూన్ 29: స్థానిక టీచర్స్ కాలనీలోని శ్రీనివాసులు, సుధారాణి ఇంట్లో దొంగలు పడి బీరువాలోని రూ. 16 వేలు నగదు, 200 గ్రాముల బంగారం చోరీ చేసినట్లు రూరల్ ఎస్‌ఐ రవికుమార్ తెలిపారు. శనివారం ఉదయం శ్రీనివాసులు, సుధారాణి ప్రైవేట్ పాఠశాల్లో టీచర్లుగా పనిచేస్తుండడంతో పాఠశాలకు వెళ్లారు. సాయంత్రం పాఠశాల నుంచి ఇంటికి వచ్చి చూడగా ఇంటి తాళం తెరచి ఉంది. దీంతో ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలో నగదు, బంగారు నగలను పరిశీలించగా దొంగలు అపహరించి నట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటన స్థలానికి ఎస్‌ఐ రవికుమార్ వెళ్లి పరిశీలించారు. ఆదివారం ఫింగర్ ప్రింట్స్ టీమ్, డాగ్‌స్క్వాడ్ పరిశీలించిన అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తామన్నారు.

రెస్టారెంట్‌లో అగ్నిప్రమాదం

మదనపల్లె టౌన్, జూన్ 29: మదనపల్లె పట్టణ బైపాస్ రోడ్డు పక్కన ఉన్న వెన్నెల రెస్టారెంట్‌లో శనివారం మధ్యాహ్నం అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. రెస్టారెంట్ మెడ్డెపైన గదుల్లో ఏసీ షార్టుసర్క్యూట్ కావడంతో ఒక్కసారిగా మంటలు ఎగిసాయి. ఈ ప్రమాదంలో గదిలోని మంచం, బెడ్లు, కుర్చీలు, సోఫాలు దగ్ధమయ్యాయి. సమాచారం అందుకున్న ఫైర్ ఆఫీసర్ శివప్ప, సిబ్బంది వెళ్లి మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో రూ.లక్ష దాకా ఆస్తి నష్టం జరిగి వుంటుందని రెస్టారెంట్ నిర్వాహకుడు చలపతి పేర్కొన్నారు. మంటలను ఆర్పి వేయడంతో మరో రూ.50వేలు విలువైన ఆస్తిని కాపాడినట్లు ఫైర్‌ఆఫీసర్ శివప్ప తెలిపారు.

అభివృద్ధి ప్రతిపాదనలను అందజేయండి

● అధికారులకు ఎమ్మెల్యే కిశోర్ ఆదేశాలు



పీలేరులో అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి

పీలేరు, జూన్ 29: మండలంలో అభివృద్ధి పథకాలకు సంబంధించిన ప్రతిపాదనలను వచ్చే నెల 8వ తేదీలోపు తనకు అందజేయా లని ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే హోదాలో తొలిసారిగా పీలేరు ఎంపీడీవో కార్యాలయంలో శనివారం మధ్యాహ్నం మండల అధికారులతో సమీక్ష నిర్వహించిన ఆయన మండలంలో అర్ధాంతరంగా నిలిచిపోయిన పథకాల వివరాలు తనకు అందజేయాలని వారిని ఆదేశించారు. అదే విధంగా అభివృద్ధి పథకాలకు సంబంధించిన ప్రతిపాదనలను తనకు అందజేస్తే జూలై 9వ తేదీ నుంచి అసెంబ్లీ సమావేశాలు ఉన్నందున సంబంధిత మంత్రులతో మాట్లాడి వాటికి నిధులు మంజూరుకు కృషి చేస్తానన్నారు. గత ఐదేళ్లలో పీలేరు మండలంలో జరిగిన జగనన్న కాలనీలపై విజిలెన్స్ అధికారులుగానీ, సీఐడీ అధికారులతో గానీ విడిగా విచారణ చేయిస్తామని, తప్పు చేసిన వారు అధికారులైనా, రాజకీయ నాయకులైనా వదిలిపెట్టబోమన్నారు. నాయకుల అక్రమార్జన కోసం గతంలో అధికారులు అడ్డూఅదుపు లేకుండా సహకరించారని, ఇకపై అటువంటి వాటిని ప్రోత్సహించబోనని స్పష్టం చేశారు. రెవెన్యూ, హౌసింగ్ శాఖలపై గతంలో మదనపల్లె సబ్‌కలెక్టర్ జాహ్నవి అందించిన విచారణను ప్రామాణికంగా తీసుకుని త్వరలోనే పీలేరు పరిసర ప్రాంతాల్లో జరిగిన భూఆక్రమణలపై సమగ్ర విచారణ జరుపుతామని తెలిపారు. పేద ప్రజలకు మేలు చేసేలా పరిపాలన సాగించడం తమ అభిమతమని, అందుకు సహకరించాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు.

తొలిసారి కౌన్సిల్ సమావేశానికి ఎమ్మెల్యే

●ఎక్స్‌అఫిషియో సభ్యునిగా ప్రమాణ స్వీకారం ●ఎన్‌టీఆర్‌కు ఘన నివాళి ● షాజహాన్‌బాషాకు నేతలు, కౌన్సిలర్ల ఘనసన్మానం



కౌన్సిల్ హాలులో ఎమ్మెల్యే షాజహాన్‌బాషాను సన్మానిస్తున్న చైర్‌పర్సన్ మనూజ, వైస్‌చైర్మన్ జింకా వెంకటాచలపతి, కౌన్సిలర్లు

మదనపల్లె, జూన్ 29: మదనపల్లె ఎమ్మెల్యే ఎం.షాజహాన్‌బాషా శనివారం మొదటిసారిగా కౌన్సిల్ సమావేశానికి విచ్చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ కె.ప్రమీల, ఎమ్మెల్యే చేత ఎక్స్ అఫిషియో సభ్యునిగా ప్రమాణ స్వీకారం చేసి రికార్డులో సంతకం చేశారు. అంతకు ముందు కౌన్సిల్ హాలులో టీడీపీ కౌన్సిలర్ పి.తులసీ ఏర్పాటు ఎన్‌టీఆర్ చిత్ర పటాన్ని ఆవిష్కరించి, పూలమాల వేసి ఎమ్మెల్యే ఘనంగా నివాళులర్పించారు. వైసీపీ ప్రభుత్వంలో ఆ పార్టీ పాలకవర్గం రాగానే, ఇదివరకే కౌన్సిల్ హాలులో ఉన్న ఎన్టీఆర్ చిత్రపటాన్ని తొలగించారు. తిరిగీ చిత్రపటాన్ని ఏర్పాటు చేయాలని 20వవార్డు కౌన్సిలర్ పి.తులసీ.. ప్రతికౌన్సిల్ సమావేశంలో పెద్దపోరాటమే చేశారు. అయితే వైసీపీ అధికారంలో ఉంటడం, దానికితోడు టీడీపీ నుంచి ఇద్దరే కౌన్సిలర్లు ఉండటంతో బలం చాలకపోవడంతో ఆ ప్రయత్నాన్ని విరమించుకున్నారు. ఇటీవల ఎన్‌డీఏ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో టీడీపీ నాయకుడు పి.రామకృష్ణ..భారీ స్థాయిలో ఎన్‌టీఆర్ చిత్రపటాన్ని తయారు చేయించి కౌన్సిల్‌హాలులో ఏర్పాటు చేశారు. ఇదిలావుండగా, ఎమ్మెల్యే ప్రమాణస్వీకారోత్సవం తర్వాత మున్సిపల్ చైర్‌పర్సన్ వి.మనూజ, వైస్‌చైర్మన్లు జింకా వెంకటాచలపతి, బి.ఎ.నూర్‌ఆజాంతోపాటు 31 మంది కౌన్సిలర్లు పార్టీలకు అతీతంగా సమూహంగా, వ్యక్తిగతంగాను ఎమ్మెల్యేకు స్వాగతం పలికి, ఘనంగా సన్మానించారు. అంతకుముందు కౌన్సిల్ సమావేశానికి వచ్చిన ఎమ్మెల్యేను ఉమ్మడి పార్టీనేతలు, కార్యకర్తలు, అభిమానులు, పట్టణ ప్రముఖులు మున్సిపల్ కార్యాలయానికి చేరుకుని షాజహాన్‌బాషాను సన్మానించడంతోపాటు పూలమాలల వేసి, దుశ్శాలువతో ఘనంగా సత్కరించి, అభినందించారు. అలాగే ఎమ్మెల్యే నివాసం నుంచి పార్టీనేతలు, కార్యకర్తలు, అభిమానులు ఎమ్మెల్యేకు మద్దతుగా ఎన్‌టీఆర్ సర్కిల్ నుంచి భారీ ర్యాలీగా మున్సిపల్ కార్యాలయానికి చేరుకుని అభినందించారు. ఈ సందర్భంగా స్థానిక చర్చి ఎదుట క్రేన్ సాయంతో భారీ గజమాల వేసి ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికారు. మున్సిపల్ కమిషనర్ కె.ప్రమీల ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఆవరణలో స్వాగత ఏర్పాట్లు చేపట్టి షాజహాన్‌బాషాను ఆహ్వానించారు.

మున్సిపల్ కార్యాలయంలో పసుపు సందడి

మదనపల్లె మున్సిపల్ కార్యాలయం శనివారం పసుపు మయం అయింది. అయిదేళ్ల తర్వాత తిరిగీ టీడీపీ నేతలు, కార్యకర్తలు, పార్టీ అభిమానులతో సందడిగా మారింది. ఎమ్మెల్యే షాజహాన్‌బాషా మొదటిసారిగా మున్సిపల్ కార్యాలయానికి విచ్చేస్తుండటంతో నియోజకవర్గంలోని పార్టీనేతలు, కార్యకర్తలు పెద్దఎత్తున ఇక్కడికి చేరుకోవడంతో కోలాహలంగా మారింది.

మంత్రి దృష్టికి బి.కొత్తకోట భూ సమస్య



మంత్రి రాంప్రసాద్‌రెడ్డితో సమస్య చెప్పుకుంటున్న బాధిత మహిళ

బి.కొత్తకోట, జూన్29: రాష్ట్ర రవాణాశాఖా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి దృష్టికి బి.కొత్తకోట భూసమస్య వెళ్లింది. బి.కొత్తకోట మండల పరిధిలోని గుమ్మసముద్రం పంచాయతీ కొత్తపల్లె వద్ద బి.కొత్తకోటకు చెందిన మహిళారైతు అరుణ తాను కొనుగోలు చేసిన వ్యవసాయభూమిలో వేరుశెనగగింజలు వేయగా అదేగ్రామానికి చెం దిన కొందరు వ్యక్తులు పంటను ట్రాక్టర్‌తో దున్నేసిన ఘటనపై పోలీ సులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. దీనిపై పోలీసులు విచారణ చేపట్టారు. తాజాగా శనివారం మహిళా రైతు అరుణ రాయచోటిలో మంత్రిని కలిసి తన బాధను చెప్పుకున్నారు. మంత్రి సమస్యను విని న్యాయం చేయాల్సిందిగా పోలీసులను ఆదేశించినట్లు తెలిసింది.

ప్రభుత్వం మారినా.. తీరుమారదా..?



బి.కొత్తకోటలో ప్రభుత్వ కార్యాలయ భవనాలపై వున్న జగన్ బొమ్మలు

బి.కొత్తకోట, జూన్29: కూటమి ప్రభుత్వ ఏర్పడినా బి.కొత్తకోట నగర పంచాయతీలో ప్రభుత్వ భవనాల పై ఇంకా మాజీ సీఎం జగన్‌రెడ్డి చిత్రపటాలు, వైయస్సార్ పేరు తొలగక పోవడం గమనార్హం. కార్యాలయాల లోపలకానీ,బయట కానీ ఫొటోలు,పేర్లు ఉండటానికి వీలు లేదని, తక్షణం తొలగించాలని ప్రభుత్వం ఆదేశించినా అధికారులు ఆ ఆదేశాలను పూర్తిగా అమలు చేయడం లేదు అనేందుకు ఇదో ఉదాహరణ అని పలువురు చర్చించు కుంటున్నారు. ఎన్నికలకోడ్ అమల్లో ఉన్నప్పుడు ఫొటోలు కనపడకుండా తాత్కాలికంగా పేపరును అంటించారు. అదికాస్తా ఊడిపోయి నిత్యం రద్దీగా వుండే సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ సమీపంలోని నూతన భవనాల కు ప్రస్తుతం జగన్ బొమ్మలు దర్జాగా దర్శనమిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకుంటారేమో చూడాల్సిందే..

ఎస్టీ కాలనీలో మౌలిక వసతులు కల్పించాలి

పీలేరు, జూన్ 29: పీలేరు మండలం అగ్రహారం పంచాయతీ ఆరెం వారిపల్లె ఎస్టీ కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని కాలనీవాసులు అధికారులకు విజ్ఞప్తి చేశారు. సివిల్ రైట్స్ డే కార్యక్రమంలో భాగంగా శనివారం మండల అధికారులు ఎస్టీ కాలనీలో ప్రత్యేక సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా 'బాస్' జిల్లా కో-కన్వీనర్ పాలకుంట శ్రీని వాసులు మాట్లాడుతూ కాలనీ వాసులు ఇంటి నిర్మాణాలు పూర్తి చేసుకున్నా వారికి బిల్లులు అందక కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో దళిత సంఘ నేతలు ధరణీకుమార్, కృష్ణయ్య, ఎర్రబెల్లి మల్లికా ర్జున, గండికోట వెంకటేశ్, గట్టప్ప, ఆనంద, రెడ్డయ్య పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించండి

పెద్దమండ్యం, జూన్ 29: బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలని పెద్దమండ్యం ఎంఈవో 2 రామకృష్ణ పిలుపు నిచ్చారు. పెద్దమండ్యంలో శనివారం నేను బడికి పోతా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచి బాల కార్మికులను నిర్మూలించాలని కోరారు. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గి మూత పడితే కష్టంగా మారుతుందన్నారు. ప్రిన్సిపాల్ రాణికుమారి, ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

విద్యార్థులకు విద్యాసామగ్రి వితరణ

బి.కొత్తకోట, జూన్29: బి.కొత్తకోట మండలంలోని జరప్పల్లె ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు అన్నపూర్ణ ఫౌండేషన్ ప్రతినిధులు రాజశేఖర్, రామాంజులు విద్యాసామగ్రిని వితరణ చేశారు. మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శీనూనాయక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రక్తపరీక్షలు చేయించుకోవాలి

కలకడ, జూన్ 29:మంచి ఆరోగ్యం కోసం ప్రతి ఒక్కరు హిమోగ్లోబిన్ పరీక్షలు చేయించుకోవాలని డాక్టర్లు కిశోర్‌కుమార్‌రెడ్డి, జవహర్‌బాబులు తెలిపారు. శనివారం పాపిరెడ్డిగారిపల్లె సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. క్రమం తప్పకుండా పోషకాహారం తీసుకోవాలన్నారు. జయరామయ్య, సుబ్బరత్నమ్మ, భారతమ్మ, వెంకటేశ్వరరావులు పాల్గొన్నారు.

టీడీపీ అధ్యక్షుడిని కలసిన మధుబాబు

మదనపల్లె, జూన్ 29: టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసులు యాదవ్‌ను మదనపల్లెకు చెందిన టీడీపీ కార్యనిర్వాహక రాష్ట్ర కార్యదర్శి రాటకొండ మధుబాబు కలిశారు. మంగళగిరిలోని కేంద్ర పార్టీ కార్యాలయంలో శనివారం మర్యాదపూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యంగా పార్టీ విషయాల్లో వివిధ సందర్భాల్లో కేసులు ఎదుర్కొంటున్న నాయకులు, కార్యకర్తలు ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఎక్కువగా ఉన్నారని, ఆ కేసులను త్వరలో ఎత్తివేయడంతోపాటు వారికి పార్టీలో తగిన గుర్తింపు ఉంటుందని అధినేత హామీ ఇచ్చినట్లు మధుబాబు పేర్కొన్నారు.

జీఎన్‌ఎంలుగా కొనసాగించాలంటూ వినతి

పీలేరు, జూన్ 29: ఏఎన్‌ఎంలుగా ఉన్న తాము రెండేళ్లపాటు తీసుకున్న శిక్షణను పరిగణలోకి తీసుకుని జీఎన్‌ఎంలుగా కొనసాగించాలని కోరుతూ పీలేరు మండలంలోని పలువురు జీఎన్‌ఎంలు శనివారం ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఏఎన్‌ఎంలుగా పని చేస్తున్న తాము కోవిడ్ సమయంలో అందించిన సేవలకు ప్రతిఫలంగా గత ప్రభుత్వం జీఎన్‌ఎంలుగా పదోన్నతి కల్పించి రెండేళ్లపాటు శిక్షణ కూడా ఇచ్చిందన్నారు. కార్యక్రమంలో జీఎన్‌ఎంలు నూర్జహాన్, ప్రమీల కుమారి, ద్రాక్షాయణి, పల్లవి, లావణ్య కుమారి, కవిత, కృష్ణమ్మ, సులోచన, ఉమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీవేంకటేశ్వర స్వామికి విశేషపూజలు

మదనపల్లె అర్బన్, జూన్ 29: స్థానిక అమ్మచెరువు మిట్ట, శేసాచలంలోని లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా ఆలయకమిటీ అధ్యక్షుడు నల్లమారి రామ్మోహన్, సభ్యుల ఆధ్వర్యంలో విశేషపూజలు నిర్వహించారు. భక్తులకు స్వామివారి దర్శనం కల్పించారు. కార్యక్రమాలను ఆలయకమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

తాగునీటి సమస్యపై తక్షణం స్పందించాలి

ములకలచెరువు, జూన్ 29: తాగునీటి సమస్యలపై తక్షణం స్పందించాలని ఎంపీడీవో పోలప్ప ఆదేశించారు. స్థానిక కదిరి రోడ్డులో జరుగుతున్న పైప్‌లైన్ పనులను శనివారం ఆయన పరిశీలించారు. కదిరిరోడ్డులో ఏడాదిగా తాగునీటి సమస్య నెలకొన్న పరిష్కరించలేదని రెండు రోజుల క్రితం ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా చేసిన విషయం విదితమే. దీనిపై స్పందించిన ఎంపీడీవో ఇందులో భాగంగా కొత్తపైప్‌లైన్ పనులు చేయిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎక్కడైనా తాగునీటి సమస్య ఉత్పన్నమైతే వెంటనే పరిష్కరించాలన్నారు.

ఇళ్ల వద్దకే నేరుగా పింఛన్లు పంపిణీ

● తంబళ్లపల్లె మండలంలో 6284 మందికి రూ.4.5కోట్లు

●194 క్లస్టర్‌లలో ... 88 మంది సచివాలయ సిబ్బంది ద్వారా పంపిణీ

తంబళ్లపల్లె జూన్ 29 : మూడు నెలలుగా పింఛన్ సొమ్ము కోసం ఇబ్బంది పడ్డ పండుటా కులకు ప్రభుత్వం తీపి కబురు అందించింది. జూలై నెల 1నుంచి పింఛన్ సొమ్మును అధికారులు నేరుగా ఇంటివద్దకే వచ్చి పంపిణీ చేయనున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పెంచిన పింఛన్ సొమ్ముతో పాటు ఏప్రిల్ నెల నుంచి జూన్ వరకు 3నెలల బకాయిలు(నెలకు రూ. వెయ్యిచొప్పున) కలిపి మొత్తం జూలై నెల రూ.7వేలు అందచేయనున్నారు. తంబళ్లపల్లె మండల వ్యాప్తంగా వృద్ధాప్య, దివ్యాంగ, వితంతు అన్ని రకాల పింఛన్లు కలిపి 6284 ఉన్నాయని ఎంపీడీవో కృష్ణమూర్తి తెలిపారు. వారందరికి జూలై నెలకు పెంచిన పింఛన్, 3 నెలల బకాయితో కలిపి మండలానికి రూ.4.5 కోట్లు నిధులు విడుదలయ్యాయన్నారు. 12 సచివాలయాల పరిధిలో 194 క్లస్టర్లలో 88 మంది గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా జూలై 1న పింఛన్ దారులకు ఇళ్ల వద్దకే వచ్చి పెంచిన పింఛన్ సొమ్ముతో పాటు 3 నెలల బకాయిలను పంపిణీ చేస్తామ న్నారు.

పీటీఎంలో 8,032 మందికి .. రూ.5.45 కోట్లు మంజూరు

పెద్దతిప్పసముద్రం జూన్ 29 : పింఛన్ కోసం ఏప్రిల్, మే, జూన్ నెలల్లో ఇబ్బంది పడ్డ పింఛన్‌దారులకు కూటమి ప్రభుత్వం తీపి కబురు అందించింది. జూలై నెల నుంచి పింఛన్ సొమ్మును నేరుగా అయా గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల చేతుల మీదుగా ఇళ్ల వద్దకే వచ్చి లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఏప్రిల్ నెల నుంచి జూన్ నెల వరకు 3నెలల బకాయిలు (నెలకు రూ. వెయ్యి చొప్పున) మొత్తం కలిపి పింఛన్ రూ.7వేలు అందచేయనున్నారు. మండల వ్యాప్తంగా వృద్ధాప్య, దివ్యాంగ, వితంతు అన్ని రకాల పింఛన్‌లు కలిపి 8,032 ఉన్నాయని ఎంపీడీవో బ్రహ్మానందరెడ్డి తెలిపారు. ఇందు కోసం మండలానికి రూ.5,45,32,500 నిధులు ఆయా సచివాలయాల ఖాతాలకు జమ అయిందన్నారు.

కూలీల సంఖ్యను పెంచి ఉపాధి కల్పించండి

నిమ్మనపల్లి, జూన్ 29: మండలం లో ఉపాధి పనులకు కూలీల సం ఖ్యను పెంచి వారికి ఉపాధి కల్పిం చేలా చూడాలని జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ మద్దిలేటి పేర్కొన్నారు. శనివారం స్థానిక ఉపాధి కార్యాల యం ఎదుట 18వ విడత జాతీయ గ్రామీణ ఉపాధి హామీ సామాజిక తనిఖీ నిర్వహిచారు. కాగా పనుల వద్ద సూచిక బోర్డులను ఏర్పాటు చేయకుండానే బిల్లులు మంజూరు చేయడం, సామాజిక పింఛన్‌లు చనిపోయిన వారి ఖాతాకు జమ అయినట్లు తనిఖీలో వెల్లడైనట్లు తెలిపారు. దీనిపై పీడీ మాట్లాడుతూ ఇద్దరిపై క్రమ శిక్షణారాహిత్య చర్యలు చేపట్టాలని ఆదేశించి రికవరీ కింద 5మంది సిబ్బందికి నోటీసులు ఇచ్చి వారి నుంచి రూ. 5వేలు రికవరీకి ఆదేశించారు.

హిందూ శ్మశానవాటికలకు నిధులు కేటాయిస్తాం

మదనపల్లె టౌన్, జూన్ 29: మదనపల్లె నియోజకవర్గంలోని హిందూ శ్మశానవాటికలకు స్థలాలు, నిధులు కేటాయిస్తామని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. శనివారం పట్టణ శివారులోని నక్కలదిన్నె హిందూ శ్మశాన వాటికను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా అంకిశెట్టిపల్లె టీడీపీ ఇన్‌చార్జి జంగాల రమణ, రాయచోటి శశికుమార్ సొంత నిధులతో నక్కలదిన్నె శ్మశానవాటికలో పిచ్చిపొదలు తొలగించి, చుట్టూ కంచెలు నిర్మింస్తుండటాన్ని ఎమ్మెల్యే అభినందించారు. అలాగే ఖబరస్తాన్, క్రైస్తవ శ్మశాన వాటికల్లో సదుపాయాకు నిధుల కోసం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు.

సింగిల్‌విండో పర్సన్ ఇన్‌చార్జిగా ప్రవీణ్‌కుమార్

బి.కొత్తకోట, జూన్29: బి.కొత్తకోట మండల సింగిల్‌విండో పర్సన్ ఇన్‌చార్జిగా ప్రవీణ్‌కుమార్ నియమితులయ్యారు. మదనపల్లె కో ఆపరేటివ్ బ్యాంకులో అసిస్టెంట్ రిజిస్ట్రార్ గా పనిచేస్తున్న ప్రవీణ్‌కుమార్ ను ప్రభుత్వం బి.కొత్తకోట ఇన్‌చార్జ్‌గా నియమించడంతో శనివారం ఆయన సింగిల్‌విండో కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. సింగిల్‌విండో సీఈఓ ఆదినారాయణ, సిబ్బంది ఆయనకు సాదరస్వాగతం పలికారు.